మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385
Published from Jagitial
Circulated to Telangana

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

శనివారం
SATURDAY
28-3-2026

జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 | సంచిక: 268 Issue: 268

www.evarthalu.com

28 మార్చి 2026 - శనివారం, శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం - వసంత ఋతువు, చైత్ర మాసం - శుక్లపక్షం, సూర్యోదయం - ఉ. 6:17, సూర్యాస్తమయం - సా. 6:25, తిథి, దశమి ఉ. 8:47 వరకు, తరువాత ఏకాదశి, సంస్కృత వారం, స్థిర వాసరః నక్షత్రం, పుష్యమి మ. 2:50 వరకు, తరువాత ఆశ్లేష, యోగం, సుకర్మ రా. 8:06 వరకు, కరణం, గరజి ఉ. 8:47 వరకు, వనిజ రా. 8:17 వరకు, వర్జ్యం, తె. 3:31 నుండి తె. 5:06 వరకు, దుర్ముహూర్తం, ఉ. 7:54 నుండి ఉ. 8:43 వరకు, రాహుకాలం, ఉ. 9:19 నుండి ఉ. 10:50 వరకు, యమగండం, మ. 1:52 నుండి మ. 3:23 వరకు, గుళికాకాలం, ఉ. 6:17 నుండి ఉ. 7:48 వరకు, బ్రహ్మముహూర్తం, తె. 4:41 నుండి తె. 5:29 వరకు, అమృత ఘడియలు, ఉ. 8:35 నుండి ఉ. 10:08 వరకు, అభిజిత్ ముహూర్తం, ఉ. 11:57 నుండి మ. 12:45 వరకు, గమనిక: "o" అనగా మరుసటి రోజున

## భద్రాచల సీతారాముల కల్యాణ వైభోగం



శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం మిథిలా స్టేడియంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీసమేతంగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అశేషమైన భక్త జన సందోహం మధ్య వేద పండితులు.. అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. మరోవైపు.. శ్రీరామనవమి వేళ భద్రాచలం ఆలయ అభివృద్ధి తొలి విడత పనుల్లో భాగంగా రూ.351 కోట్ల పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.

- భద్రాచలం, ఈవార్తలు

## అయోధ్య రామ్‌లల్లా సూర్యతిలక ధారణం



శ్రీరామనవమి పర్వదినాన అయోధ్యలో అత్యంత కీలకమైన 'సూర్య తిలకం' ఘట్టం సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు ఆవిష్కృతమైంది. దాదాపు 4 నిమిషాల పాటు రామ్ లల్లా విగ్రహం నుదుట తిలకంలా సూర్యకిరణాలు పడటంతో భక్తులు ఆనందంతో పరవశించిపోయారు. ఐఐటీ రూర్కీ శాస్త్రవేత్తల నేతృత్వంలో రూపొందించిన ఆప్టో-మెకానికల్ సిస్టమ్ ద్వారా సూర్య కిరణాలు నేరుగా విగ్రహంపై పడేలా ప్లాన్ చేసిన విషయం తెలిసిందే.

- అయోధ్య

# బ్లాక్ చేద్దాం!

పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం అన్ని రాష్ట్రాల సీఎంలతో సమీక్ష నిర్వహించారు. వర్చువల్‌గా సమీక్షించారు. ఈ సమావేశంలో ఆర్థిక, వాణిజ్య స్థిరత్వాన్ని కాపాడడం, ఇంధన భద్రతను నిర్ధారించడం, పౌరుల ప్రయోజనాలను రక్షించడం, పరిశ్రమలు, సరఫరా గొలుసులను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యాలుగా ఉన్నాయని ప్రధాని పేర్కొన్నారు.

### అక్రమ నిల్వను అరికడదాం
### బ్లాక్ మార్కెట్‌ను నిలువరిద్దాం
### టీమిండియాలా పనిచేద్దాం
### సంక్షోభాన్ని ఎదుర్కొందాం
### సీఎంలతో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: టీమ్ ఇండియాగా కలిసి పనిచేస్తే ఈ సవాళ్లను దేశం విజయవంతంగా అధిగమిస్తుందనే నమ్మకాన్ని కూడా ప్రధాని మోదీ వ్యక్తం చేశారు. సరఫరా గొలుసులు సజావుగా కొనసాగేందుకు రాష్ట్రాలు చర్యలు

- తరువాయి 2 వ పేజీలో...

# సర్వోదయ తెలంగాణ!

### వచ్చే నెల 25న కవిత కొత్త పార్టీ
### అదేరోజు జెండా, అజెండా ప్రకటన
### వెల్లడించిన కల్వకుంట్ల కవిత



తెలంగాణ గడ్డపై మరో కొత్త పార్టీ ఏర్పాటుకు రంగం సిద్ధం అయింది. ఎప్పటి నుంచో పార్టీ పెట్టనున్నట్లు తెలిపిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత..

## పెట్రో ఎక్సైజ్ సుంకం రూ.10 తగ్గింపు




న్యూఢిల్లీ: పశ్చిమ ఆసియాలో యుద్ధ ప్రభావంతో చమురు రంగంపై పెరుగుతున్న ఒత్తిడిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గిస్తూ ఉపశమనం కల్పించింది. పశ్చిమ ఆసియాలో

- తరువాయి 2 వ పేజీలో...

## వాణిజ్య గ్యాస్ సరఫరా పెంపు



న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం దేశంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ సరఫరాపై పడింది. తాజాగా వీటి కొరతను అధిగమించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులోభాగంగా కమర్షియల్ ఎల్పీజీ సరఫరాను 70 శాతానికి

- తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,471 |
| వెండి (గ్రాము): | రూ.240 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,691 |

## పెళ్లైనా..లివ్ ఇన్ తప్పుకాదు

### వివాహితుడితో సహజీవనం నేరం కాదు
### అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు



ప్రయాగ్‌రాజ్: వివాహితుడైన వ్యక్తితో మేజర్ అయిన మహిళ పరస్పర అంగీకారంతో సహజీవనం చేయవచ్చని, అది నేరం కిందకు రాదని అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు చెప్పింది. నైతికతను, చట్టాన్ని వేర్వేరుగా చూడాలని స్పష్టంచేసింది. ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌కు చెందిన ఓ వివాహితుడు, 18 ఏళ్ల యువతి సహజీవనం చేస్తున్నారు. దాంతో యువతి కుటుంబసభ్యులు వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఆ కేసును కొట్టివేయాలని సహజీవనం చేస్తున్న జంట అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ జేజే మునీర్, జస్టిస్ తరుణ్ సక్సేనాలతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. కేసు వివరాల్లోకి వెళ్తే.. షాజహాన్‌పూర్‌కు చెందిన 18 ఏళ్ల అనామిక, వివాహితుడైన నేత్రపాల్ అనే వ్యక్తితో సహజీవనం

- తరువాయి 2 వ పేజీలో...

## 3 రోజులు వర్షాలు

### మండే ఎండల్లో చల్లని కబురు



విశాఖపట్నం/హైదరాబాద్, మార్చి 27 (ఈవార్తలు): గురువారం మరాత్వాడ ప్రాంతం నుండి ఉత్తర అంతర్గత కర్ణాటక మీదుగా దక్షిణాంతర్గత కర్నాటక వరకు కొనసాగిన ద్రోణి శుక్రవారం మరాత్వాడ ప్రాంతం నుండి కర్ణాటక తీరప్రాంతం వరకు ఉత్తర అంతర్గత కర్ణాటక మీదుగా సగటు సముద్ర మట్టం నుండి 0.9 కి మీ ఎత్తులో కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలో శుక్రవారం ,శనివారం, ఆదివారం తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. అలాగే రానున్న రెండు రోజులలో

- తరువాయి 2 వ పేజీలో...

## నేపాల్ ప్రధానిగా బాలేంద్ర షా ప్రమాణం


### 15 మందితో మంత్రివర్గం ఏర్పాటు



ఖట్మండు: నేపాల్ నూతన ప్రధానమంత్రిగా బాలేంద్ర షా శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఖాట్మాండులోని అధ్యక్ష భవనం 'శీతల్ నివాస్'లో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షులు రామ్ చంద్ర పౌడెల్ బాలేంద్ర షా

- తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ఒక పక్షి అలస్కా నుంచి టాస్మానియా వరకు ఏకంగా 13,500 కిలోమీటర్లు ప్రయాణించింది. విశేషం ఏంటంటే.. ఈ ప్రయాణంలో ఆ పక్షి ఎక్కడకూడా ఆగలేదట. దీంతో ఆ పక్షి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. ఆ పక్షికి 5జీ శాటిలైట్ ట్యాగ్ అతికించి, దాని ప్రయాణాన్ని పర్యవేక్షించారు.

## కరీంనగర్ ఆర్‌బీఎల్ బ్యాంకులో భారీ స్కాం

### రూ.137 కోట్ల మేర అక్రమ లావాదేవీలు
### చైనాతో కలిసి స్థానిక యువత మోసాలు
### మ్యూల్ ఖాతాల నెట్‌వర్క్‌తో దోపిడీలు




కరీంనగర్, మార్చి 27 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లాలో సంచలనం సృష్టించిన 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0' ద్వారా భారీ ఆర్థిక కుంభకోణాన్ని పోలీసులు ఛేదించారు. జిల్లాలోని కిసాన్‌నగర్ ఆర్‌బీఎల్ బ్యాంక్ బ్రాంచ్ కేంద్రంగా జరిగిన ఈ భారీ స్కామ్‌లో సుమారు రూ.137 కోట్ల అక్రమ లావాదేవీలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. చైనాకు చెందిన కొందరు వ్యక్తులతో చేతులు కలిపి స్థానిక యువత ఈ మోసాలకు పాల్పడటం గమనార్హం. ఈ ముఠా ప్రధానంగా 'మ్యూల్ ఖాతాల' నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంది. సాధారణ వ్యక్తుల పేరిట బ్యాంక్ ఖాతాలను తెరిపించి, వాటిని అక్రమ సొమ్మును మళ్లించడానికి వాడటాన్ని మ్యూల్ అకౌంట్స్ అంటారు. కిసాన్‌నగర్ బ్రాంచ్‌లోని కేవలం 7 మ్యూల్ ఖాతాల ద్వారానే ఏకంగా రూ.137 కోట్ల మేర లావాదేవీలు నిర్వహించినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వెల్లడించారు. ఈ కుంభకోణంలో ప్రధాన నిందితుడు బండారి సాయిరామ్ కీలక పాత్ర పోషించాడు. ఇతడు చైనాకు చెందిన సైబర్ నేరగాళ్లతో నేరుగా సంబంధాలు కలిగి ఉన్నాడు. ఈ అక్రమ లావాదేవీలను పర్యవేక్షించినందుకు గాను సాయిరామ్ ప్రతి ట్రాన్సాక్షన్‌పై

- తరువాయి 2 వ పేజీలో...

## మేమే గెలిచాం

### ఇరాన్‌పై యుద్ధంలో ఆధిపత్యం సాధించాం
### చర్చల కోసం మరో 10 రోజలు గడువు
### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి



వాషింగ్టన్: ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా పూర్తిగా గెలిచింది అని, ఆ దేశ సైనిక సామర్థ్యాన్ని దాదాపు నాశనం చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. అయితే, తదుపరి చర్యలకు ముందు చర్చల కోసం టెహ్రాన్‌కు 10 రోజుల గడువు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఫాక్స్ న్యూస్ ఛానెల్‌కు ఫోన్‌లో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా సైనిక చర్యలతో ఇరాన్ యుద్ధం చేసే సత్తాను కోల్పోయిందని ట్రంప్ అన్నారు. "మేం ఇప్పటికే యుద్ధం గెలిచాం. సైనికపరంగా ఇరాన్‌ను

- తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

28-3-2026

మేషం: దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అవుతాయి. కొత్త పనులకు శ్రీకారం చుడతారు. ఆర్థిక విషయాలు సంతృప్తినిస్తాయి. స్థిరాస్తి వివాదాలు తీరతాయి. ధార్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

వృషభం: ఆర్థిక వ్యవహారాలలో చికాకు పరుస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ముఖ్య వ్యవహారాలలో ప్రతిబంధకాలు ఉంటాయి. మిత్రులతో దైవదర్శనాలు చేసుకుంటారు. కుటుంబసభ్యులతో మాట పట్టింపులు కలుగుతాయి. వ్యాపారాలు కొంత మందగిస్తాయి. ఉద్యోగాలు అధికారులతో చికాకులు పెరుగుతాయి.

మిధునం: నూతన పనులు చేపడతారు. ఆత్మీయుల నుంచి శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలు ఉన్నవి. చాలా కాలంగా పడిన శ్రమ ఫలిస్తుంది. విలువైన వస్తు లాభాలు పొందుతారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగాలు ఆశాజనకంగా ఉంటాయి.

కర్కాటకం: చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. బంధువులతో మాటపట్టింపులు కలుగుతాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు ఉంటాయి. ఇంటా బయట పరిస్థితులు అనుకూలించవు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు కొంత నిదానంగా సాగుతాయి. ఉద్యోగ విషయమై అధికారులతో చర్చలు అనుకూలించవు.

సింహం: ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి. సంఘంలో విశేషమైన గౌరవ మర్యాదలు పొందుతారు. నూతన గృహ నిర్మాణ ప్రయత్నాలు ప్రారంభిస్తారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

కన్య: వివాదానికి సంబంధించి ప్రముఖుల నుంచి అందిన సమాచారం ఊరట కలిగిస్తుంది. ఆర్థికంగా మరింత మెరుగైన వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వృత్తి వ్యాపారాలలో నష్టాల నుండి బయట పడగలుగుతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

తుల: ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. సన్నిహితులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనుల్లో ప్రతిష్ఠంభనలు కలుగుతాయి. దూర ప్రయాణ సూచనలున్నవి. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారపరంగా కొంత మెరుగైన పరిస్థితులు ఉంటాయి. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది.

వృశ్చికం: సోదరులతో కలహాల సూచనలు ఉన్నవి. నూతన ఋణాలు చేస్తారు. గృహమున ఆకస్మికంగా నిర్ణయాలు మార్పులు చేస్తారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఉద్యోగాలలో ఊహించని స్థానచలన సూచనలు ఉన్నవి.

ధనస్సు: కుటుంబ సభ్యుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. మిత్రులతో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో మీ అంచనాలు నిజమవుతాయి.

మకరం: భూవివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయాలు విస్తృతం అవుతాయి. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. ఆకస్మిక ధనలాభాలు ఉన్నవి. వ్యాపార వ్యవహారాలలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగాలలో సమస్యలు పరిష్కారం అవుతాయి.

కుంభం: ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. మిత్రులతో కలహ సూచనలు ఉన్నవి. నూతన ఋణయత్నాలు సాగిస్తారు. చేపట్టిన పనుల్లో ఆటంకాలు కలుగుతాయి. వ్యాపారాలలో కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఉద్యోగస్తులకు అధికారుల నుండి ఊహించని ఇబ్బందులు ఎదురవుతాయి.

మీనం: వృధా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ వాతావరణం చికాకుగా ఉంటుంది. ఆరోగ్య సమస్యలు మరింత బాధిస్తాయి. కొన్ని పనులు వ్యయప్రయాసలతో కానీ పూర్తి కావు. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి.

# సర్వోదయ తెలంగాణ!



నిజామాబాద్, మార్చి 27 (ఈవార్తలు): తెలంగాణ గడ్డపై మరో కొత్త పార్టీ ఏర్పాటుకు రంగం సిద్ధం అయింది. ఎప్పటి నుంచో పార్టీ పెట్టనున్నట్లు తెలిపిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. శుక్రవారం దానికి సంబంధించి కీలక విషయాలను వెల్లడించారు. పార్టీ ఆవిర్భావం, జెండా, అజెండా, విధి విధానాలను ఏప్రిల్ 25వ తేదీన వెల్లడిస్తామని తెలిపారు. ఏప్రిల్ 25వ తేదీన మంచి ముహూర్తం ఉందని.. అందుకే ఆ రోజున పార్టీని ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. శ్రీరామనవమి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు చెప్పిన కల్వకుంట్ల కవిత.. తన సొంత రాజకీయ పార్టీపై తాజాగా నిజామాబాద్ జాగృతి కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక ప్రకటన చేశారు. ఇక తన పార్టీని ఎక్కడ ప్రారంభించేది అనే విషయాన్ని కూడా కల్వకుంట్ల కవిత వెల్లడించారు. హైదరాబాద్ నగర శివారులోని మేడ్చల్ జిల్లా మునీరాబాద్ గ్రామంలోని అద్వయ కన్వెన్షన్ హాల్‌లో భారీ సభను ఏర్పాటు చేసి ముహూర్తం ప్రకారం ఉదయం 10 గంటలకు పార్టీ ఆవిష్కరణ, జెండా విడుదల చేయనున్నట్లు కవిత స్పష్టం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ నంబర్ 6 వద్ద ఉన్న 20 ఎకరాల భారీ స్థలంలో ఈ సభను నిర్వహించనున్నట్లు కవిత స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఏర్పాటుకు సంబంధించి.. ఏప్రిల్ 25వ తేదీ లోపు సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామని కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఇక తాము ఎవరి నుంచైనా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని.. దానికి సంబంధించిన వాట్సాప్ నంబర్‌ను కూడా త్వరలోనే ఇస్తామని వెల్లడించారు. ఇక తమ పార్టీ ఆవిర్భావ సభకు నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, తెలంగాణ ప్రజలు భారీ ఎత్తున తరలిరావాలని కవిత విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో మార్పు కావాలని కోరుకునే వారంతా తనతో కలిసి రావాలని ఆమె కోరారు. ఈ నేపథ్యంలోనే తమ కొత్త పార్టీలో.. కొత్త తరం నాయకత్వానికి, మరీ ముఖ్యంగా మహిళా సాధికారతకు పెద్దపీట వేయనున్నట్లు కవిత స్పష్టం చేశారు. 'సర్వోదయ తెలంగాణ' లక్ష్యంగా తెలంగాణ ఉద్యమ కారుల ఆశయాలకు అనుగుణంగా.. ప్రొఫెసర్ జయశంకర్ మార్గంలో తమ పార్టీ పనిచేస్తుందని కవిత వెల్లడించారు. ఇక నిజామాబాద్ కోడలిగా పార్టీ ప్రకటనకు సంబంధించిన విషయాన్ని అక్కడ చెప్పానని పేర్కొన్న కవిత.. ఎన్నికల్లో ఎక్కడ పోటీ చేయాలి అనే విషయంపై పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత క్లారిటీ ఇస్తామని చెప్పారు.



## వాణిజ్య గ్యాస్ సరఫరా పెంపు

మొదటి పేజీ తరువాయి

పెంచింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్ లేఖ రాశారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కమర్షియల్ ఎల్పీజీ సరఫరా కోటాను కేంద్రం ఇటీవల తగ్గించిన సంగతి తెలిసిందే. తాజాగా పరిస్థితులు మెరుగుపడుతుండటంతో క్రమంగా వాటిని పెంచుతూ వస్తోంది. గతవారం 50 శాతంగా ఉన్న ఈ వాణిజ్య సిలిండర్ల సరఫరాను.. తాజాగా మరో 20 శాతం పెంచింది. అయితే, వీటిల్లో ఉక్కు, ఆటోమొబైల్స్, వస్త్రాలు, రంగులు, రసాయనాలు, ప్లాస్టిక్ వంటి కీలక పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది.



## మేమే గెలిచాం

మొదటి పేజీ తరువాయి

పూర్తిగా ఓడించాం" అని స్పష్టం చేశారు. ఇరాన్ నౌకాదళం, వాయుసేనను దెబ్బతీశామని, చాలా వరకు క్షిపణులను, వాటి ప్రయోగ వ్యవస్థలను, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను కూడా ధ్వంసం చేశామని ఆయన వివరించారు. ఇరాన్ నాయకత్వాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని పేర్కొన్నారు. అయితే, ఇంతటి తీవ్రమైన వ్యాఖ్యలు చేసినప్పటికీ, ఇరాన్ అభ్యర్థన మేరకే తదుపరి దాడులను వాయిదా వేసినట్లు ట్రంప్ తెలిపారు. "చర్చల కోసం మరికొంత సమయం కావాలని వాళ్లు నన్ను అడిగారు. అందుకే నేను వారికి 10 రోజుల గడువు ఇచ్చాను" అని ఆయన చెప్పారు. ప్రస్తుతం చర్చలు సజావుగానే సాగుతున్నాయని కూడా పేర్కొన్నారు. ఈ చర్చల్లో ఒప్పందం కుదరకపోతే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. "వారు చేయాల్సిన పని చేయకపోతే, నేను వారి పవర్ ప్లాంట్లను నాశనం చేస్తాను" అని తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్ వంటి శత్రు దేశాలు అణ్వాయుధాలు సంపాదించకుండా నిరోధించడమే తమ లక్ష్యమని ట్రంప్ వెల్లడించారు. "ఒక ఉన్మాది లేదా పిచ్చి సిద్ధాంతం చేతిలో అణ్వాయుధం ఉండటానికి వీల్లేదు" అని అన్నారు. అమెరికా కనుక దాడి చేయకపోయి ఉంటే, ఈపాటికి ఇరాన్ అణ్వాయుధాన్ని సంపాదించి, దానిని ఉపయోగించి కూడా ఉండేదని అభిప్రాయపడ్డారు. తన చర్యలపై వస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. ప్రపంచంలోనే తమది అత్యంత శక్తివంతమైన సైన్యమని, తమకు ఎవరూ సాటిరారని ట్రంప్ పునరుద్ఘాటించారు.

## పెట్రో ఎక్సైజ్ సుంకం రూ.10 తగ్గింపు

మొదటి పేజీ తరువాయి

నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో చమురు కంపెనీలపై పెరుగుతున్న భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రూ.10 చొప్పున తగ్గించినట్లు ప్రకటించింది. తాజా నిర్ణయంతో పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకం రూ.13 నుంచి రూ.3కు తగ్గింది. అదే విధంగా రూ.10 తగ్గింపుతో డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం పూర్తిగా సున్నాకు చేరింది. ఈ నిర్ణయంతో చమురు మార్కెటింగ్ సంస్థలపై ఆర్థిక భారం కొంత మేర తగ్గనుండగా, భవిష్యత్తులో ఇంధన ధరల స్థిరీకరణకు కూడా ఇది దోహదం చేయవచ్చని భావిస్తున్నారు.

## నేపాల్ ప్రధానిగా బాలేంద్ర షా ప్రమాణం

మొదటి పేజీ తరువాయి

చేత ప్రమాణస్వీకారం చేయించారు. దీంతో నేపాల్ చరిత్రలోనే అత్యంత పిన్న వయస్కుడైన ప్రధానిగా బాలేంద్ర షా రికార్డు సృష్టించారు. ఈ నెల 5న జరిగిన నేపాల్ పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్‌పి) ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. 275 మందితో కూడిన ప్రతినిధుల సభలో కేవలం నాలుగేళ్ల క్రితం ఏర్పడిన ఆర్ఎస్‌పి 182 స్థానాలను గెలుచుకుంది. గురువారం జరిగిన సమావేశంలో ఆర్ఎస్‌పి నాయకుడిగా బాలేంద్ర షాను ఎన్నుకోవడంతో 2015 నుంచి అమల్లోకి వచ్చిన నేపాల్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 76(1) ప్రకారం షాను ప్రధానమంత్రిగా అధ్యక్షులు పౌడెల్ నియమించారు. ఈ ఆర్టికల్‌ను ఉపయోగించడం ఇదే మొదటిసారి. షా ప్రధానమంత్రిగా ప్రమాణస్వీ కారం చేసిన తరువాత 15 మంది మంత్రులు కూడా ప్రమాణస్వీకారం చేశారు. ప్రధానమంత్రి పదవితో పాటు రక్షణ, పరిశ్రమల శాఖ బాధ్యతలను కూడా షా పర్యవేక్షిస్తారు. నేపాల్ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బాలేంద్ర షాకు భారత ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఇరు దేశాల పరస్పర ప్రయోజనం కోసం భారత్-నేపాల్ సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి షాతో కలిసి సన్నిహితంగా పనిచేయడానికి ఎదురుచూస్తున్నానని తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. గత సెప్టెంబరులో జరిగిన జెన్ జెడ్ ఆందోళనలతో అప్పటి కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం కుప్పకూలిపోయిన సంగతి తెలిసిందే. తరువాత మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కి నేతృత్వంలో మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.



## పెళ్లైనా..లివ్ ఇన్ తప్పుకాదు

మొదటి పేజీ తరువాయి

చేస్తున్నది. అయితే జనవరి 8న అనామిక తల్లి కాంతి.. తన కుమార్తెను నేత్రపాల్ ప్రలోభపెట్టి తీసుకెళ్లాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 87 కింద కేసు నమోదు చేశారు. అయితే ఆ కేసును కొట్టివేయాలని, తమకు రక్షణ కల్పించాలని కోరుతూ అనామిక, నేత్రపాల్ హైకోర్టును ఆశ్రయించారు. తామిద్దరం మేజర్లమని, ఇష్టపూర్వకంగానే కలిసి జీవిస్తున్నామని తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. నేత్రపాల్‌కు అప్పటికే వివాహమైనందున, అతను మరో మహిళతో సహజీవనం చేయడం చట్టరీత్యా నేరమని యువతి కుటుంబం తరఫు న్యాయవాది వాదించారు. ఈ వాదనను కోర్టు తోసిపుచ్చింది. ఇద్దరు మేజర్లు అంగీకారంతో కలిసి జీవించినప్పుడు అందులో నేరపూరిత కోణం ఏమీ లేదని స్పష్టం చేసింది. మేజర్ అయిన మహిళ అనామిక తన ఇష్టప్రకారమే నేత్రపాల్‌తో జీవిస్తున్నట్లు పోలీసులకు చెప్పిన విషయాన్ని కోర్టు గుర్తుచేసింది. ఈ సందర్భంగా తమకు కుటుంబసభ్యుల నుంచి ప్రాణహాని ఉందని, వారు పరువు హత్యకు పాల్పడే ప్రమాదం ఉందని అనామిక, నేత్రపాల్ జంట ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై తీవ్రంగా స్పందించిన న్యాయస్థానం.. జంటకు భద్రత కల్పించడంలో విఫలమైన పోలీసులపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆ జంట భద్రతకు స్థానిక ఎస్పీ వ్యక్తిగతంగా బాధ్యత వహించాలని ఆదేశించింది. వారి ఇంటికి వెళ్లడంగానీ, ఫోన్ లేదా ఇతర మార్గాల ద్వారా సంప్రదించడంగానీ చేయవద్దని యువతి కుటుంబ సభ్యులను హెచ్చరించింది. ఈ కేసు తదుపరి విచారణను ఏప్రిల్ 8కి వాయిదా వేసింది.





## 'బ్లాక్' చేద్దాం!

మొదటి పేజీ తరువాయి

తీసుకోవాలని సూచించారు. నిల్వ దాచిపెట్టడం, అధిక లాభాల కోసం దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రధాని తెలిపారు. అలాగే వ్యవసాయ రంగంలో ముందస్తు ప్రణాళిక అవసరాన్ని చెప్పారు. ముఖ్యంగా ఎరువుల నిల్వలు పంపిణీపై పర్యవేక్షణ పెంచి అంతరాయాలు రాకుండా చూడాలని తెలిపారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడి చేయడంతో ప్రారంభమైన పశ్చిమ ఆసియా ఘర్షణ నేపథ్యంలో ముఖ్యమంత్రులతో ప్రధాని నిర్వహించిన తొలి సమావేశం ఇదే. ఈ సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు నాయుడు (ఆంధ్రప్రదేశ్), రేవంత్ రెడ్డి(తెలంగాణ), యోగి ఆదిత్యనాథ్ (ఉత్తరప్రదేశ్), భూపేంద్ర పటేల్(గుజరాత్), భగవంత్ మాన్ (పంజాబ్),సుఖ్వీందర్ సింగ్ సుఖు(హిమాచల్ ప్రదేశ్), ఒమర్ అబ్దుల్లా (జమ్మూ కాశ్మీర్), పెమా ఖాండు (అరుణాచల్ ప్రదేశ్) తదితరులు ఉన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

### హాజరు కాని 5 రాష్ట్రాల సీఎంలు

ఇదే సమయంలో ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల ముఖ్యమంత్రులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కారణంగా ఈ సమావేశంలో పాల్గొనలేదు. ఎన్నికలు జరగనున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, కేరళం సహా పుదుచ్చేరి ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ కార్యదర్శి వర్గం ప్రత్యేక సమావేశం నిర్వహించనుంది. మరోవైపు, పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులను సమగ్రంగా పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వం వహించనున్నారు. ఇందులో విదేశాంగ, గృహ, ఆర్థిక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు సభ్యులుగా పాల్గొంటారు.

## 3 రోజులు వర్షాలు

మొదటి పేజీ తరువాయి

గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలో కొనసాగి తదుపరి నాలుగు రోజులలో సాధారణ స్థాయి నుండి క్రమేపీ రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. అలాగే వర్షాల సమయంలో 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇక అటు ఆంధ్రప్రదేశ్, యానాంపై దిగువ ట్రోపో ఆవరణములో ఆగ్నేయ, నైరుతి దిశగా వీస్తున్న గాలుల ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని ఏపీ విపత్తు నిర్వహణ శాఖ పేర్కొంది. అలాగే వర్షాల సమయంలో గంటకు 30-40 కిలీమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

## కరీంనగర్ ఆర్‌బీఎల్ బ్యాంకులో భారీ స్కాం

మొదటి పేజీ తరువాయి

2 శాతం కమీషన్‌ను క్రిప్టో కరెన్సీ రూపంలో పొందేవాడు. ఇలా మొత్తం మీద నిందితులకు సుమారు రూ.2 కోట్ల వరకు కమీషన్ లభించినట్లు దర్యాప్తులో తేలింది. పోలీసులు చేపట్టిన పక్కా ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 8 కేసులు నమోదు చేసి.. 13 మంది నిందితులను అరెస్టు చేశారు. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే.. ఈ ముఠాలో డిప్లొమా, డిగ్రీ , ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు సభ్యులుగా ఉన్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో వీరు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి తమ భవిష్యత్తును పాడుచేసుకున్నారు. బ్యాంక్ ఖాతాలను ఇతరులకు అద్దెకు ఇవ్వడం లేదా తెలియని వ్యక్తుల లావాదేవీలకు వాడటం చట్టరీత్యా నేరమని సీపీ గౌస్ ఆలం హెచ్చరించారు. ముఖ్యంగా విద్యార్థులు ఇటువంటి తక్కువ కాలంలో ఎక్కువ లాభం వచ్చే ఆశల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



# జైశెట్టి రమణయ్య కన్నుమూత

## వృద్ధాప్య సమస్యలతో జగిత్యాలలో మృతి.. చరిత్రలో అనేక పరిశోధనలతో ప్రఖ్యాతి

### తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు గురువు.. రమణయ్య మృతిపై కేసీఆర్ సంతాపం



జగిత్యాల, మార్చి 27 (ఈవార్తలు): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గురువు, చరిత్ర సబ్జెక్టులో అనేక పరిశోధనలు చేసిన ప్రముఖ చరిత్రకారుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, జగిత్యాల జిల్లావాసి డాక్టర్ జైశెట్టి రమణయ్య(87)శుక్రవారం తెల్లవారుజామున స్వగృహంలో కన్నుమూశారు. బోధనారంగంలో విశేష సేవలందించిన ఆయన, కొన్నాళ్లుగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. 17వ ఏట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా బోధనను ప్రారంభించిన రమణయ్య, నలభై ఏండ్ల సుదీర్ఘ ఉపాధ్యాయ ప్రస్తానంలో వేలాది మందికి బోధన చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌కు సైతం ఇంటర్మీడియెట్‌లో చరిత్ర లెక్చరర్‌గా బోధించారు. 1971లో సిద్దిపేటలోని జూనియర్, డిగ్రీ కాలేజీలో హిస్టరీ లెక్చరర్‌గా పనిచేశారు. చిన్న వయసులోనే అధ్యాపక వృత్తిలోకి అడుగుపెట్టిన ఆయన, జగిత్యాలలో తొలి డాక్టరేట్ పొందిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. సౌత్ ఇండియా టెంపుల్స్ అనే అంశంపై పరిశోధన చేసి ఆయన పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.

**కేసీఆర్ తీవ్ర విచారం**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన గురువు మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు, జగిత్యాలకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు, రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ జైశెట్టి రమణయ్య మృతిపై ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా తన గురువుతో ఉన్న అనుబంధాన్ని, ఆత్మీయతను కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. తాను సిద్దిపేటలో ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో రమణయ్య గారు హిస్టరీ లెక్చరర్‌గా ఉండేవారని, ఆయన వద్ద విద్యను అభ్యసించిన సందర్భాన్ని కేసీఆర్ స్మరించుకున్నారు. రమణయ్య గారు తనకు అత్యంత ఆత్మీయుడని పేర్కొన్నారు. ఆయన మరణం తీరని లోటని అన్నారు. రమణయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## తీన్మార్ మల్లన్న పాదయాత్ర

**జూన్ 2 నుంచి ప్రారంభం**



హైదరాబాద్, మార్చి 27 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో సంచలనాలకు కేంద్ర బిందువైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కీలక ప్రకటన చేశారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాదయాత్ర చేపడుతున్నట్టు ప్రకటించారు. తీన్మార్ మల్లన్న నేతృత్వంలోని 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ' ఈ యాత్రను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. కేవలం ఒక నిరసనగా కాకుండా, బీసీలకు, వెనుకబడిన తరగతులకు రాజకీయ అధికారం దక్కాలనే ప్రధాన అజెండాతో ఈ యాత్ర సాగనుంది. గ్రామగ్రామాన పర్యటించి బీసీల సమస్యలను తెలుసుకోవడమే కాకుండా, రాజకీయ సాధికారతకు అవసరమైన మద్దతను కూడగట్టడమే లక్ష్యంగా పాదయాత్ర కొనసాగనుంది. జూన్ 2న ప్రారంభం కానున్న ఈ సుదీర్ఘ పాదయాత్రకు సంబంధించి ఇప్పటికే రూట్ మ్యాప్ సిద్ధమైంది. ఏ జిల్లా నుంచి యాత్ర మొదలవుతుంది, ఏయే దశల్లో ఎన్ని కిలోమీటర్లు సాగుతుంది అనే పూర్తి వివరాలు త్వరలోనే అధికారికంగా వెల్లడి కానున్నాయి.

# ఒలింపిక్స్‌కు పోయేదుందా?

**కావాలంటే పిల్లలకు అవకాశాలివ్వాలి**

**మేం స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్, మార్చి 27 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న లెజిస్టేటర్ స్పోర్ట్స్ మీట్-2026ను తాము బహిష్కరిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సభను కనీసం ఇంకో 10 రోజులు కొనసాగించి ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందని, అనేక కీలక అంశాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను పక్కనబెట్టి, అర్ధాంతరంగా అసెంబ్లీని వాయిదా వేసి క్రీడలు నిర్వహించడం ప్రజలు సమర్ధించరని, ఇది మంచి పరిణామం కాదని కేటీఆర్ అన్నారు. నిత్యం రాజకీయాలు, ప్రజా సమస్యలతో బిజీగా ఉండే తెలంగాణ ప్రజాప్రతినిధులకు బిగ్ రిలీఫ్ ప్రకటించారు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్. ప్రజాప్రతినిధులకు ఆటలపోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం 'లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్--2026' నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 28, 29 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం వేదికగా ఈ క్రీడా పోటీలు జరగనున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఈ లెజిస్టేటర్ స్పోర్ట్స్ మీట్-2026కు బీఆర్ఎస్ సభ్యులు హాజరుకావడం లేదు అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం నిర్వహిస్తున్న క్రీడా పోటీలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని రంగాల ప్రజలు అనేక సమస్యలు, సంక్షోభాలు ఎదుర్కొంటున్న సమయంలో ఇటువంటి క్రీడా కార్యక్రమాలలో పాల్గొని సమయం వృథా చేయడం తగదని స్పష్టం చేశారు. 'మేము ఎమ్మెల్యేలుగా ఈ క్రీడా పోటీలలో పాల్గొనబోమని కేటీఆర్ వెల్లడించారు. సభను కనీసం ఇంకో 10 రోజులు కొనసాగించి ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందని, అనేక కీలక అంశాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను పక్కనబెట్టి, అర్ధాంతరంగా అసెంబ్లీని వాయిదా వేసి క్రీడలు నిర్వహించడం ప్రజలు సమర్ధించరని, ఇది మంచి పరిణామం కాదని ఆయన అన్నారు. ప్రభుత్వం కూడా ఈ క్రీడా పోటీలపై పునరాలోచన చేయాలి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. 'మేము క్రీడలు ఆడి ఒలింపిక్స్‌కి వెళ్లేది ఏమీ లేదు. క్రీడలను ప్రోత్సహించాలంటే పిల్లలకు అవకాశాలు కల్పించి, వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆటలు ఆడించడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదు'అని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే ఎవరైనా క్రీడల్లో పాల్గొనాలనుకుంటే ముందుగా ప్రజా సమస్యలపై చర్చలు పూర్తిచేసి, శాసనసభను నిరవధికంగా వాయిదా వేసిన తర్వాత రెండు రోజులపాటు క్రీడలు నిర్వహించుకోవచ్చని సూచించారు. అసెంబ్లీ వాయిదా వేసి క్రీడలు నిర్వహించడం హాస్యాస్పదమని ఆయన విమర్శించారు. ఈ పరిణామాలు చూస్తే ప్రభుత్వానికి ప్రజా సమస్యల పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.



## భద్రాచలంలో ఘనంగా సీతారాముల కల్యాణం

**పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి దంపతులు**

భద్రాచలం, మార్చి 27 (ఈవార్తలు): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచలంలో జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్ రెడ్డి సతీసమేతంగా హాజరయ్యారు. సంప్రదాయం ప్రకారం స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఇదే సందర్భంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. శ్రీరామనవమి నాడు పాలకులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడం గోల్కొండ నవాబుల కాలం నుంచి వస్తున్న ఆనవాయితీ. ఈ సంప్రదాయాన్ని గౌరవిస్తూ సీఎం రేవంత్ రెడ్డి తన అర్ధాంగితో కలిసి స్వామివారికి వస్త్రాలు అందజేశారు. తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టాక, భద్రాద్రి రాముడిపై తన భక్తిని చాటుకుంటూ ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారు. భద్రాచలం ఆలయాన్ని మూడు దశల్లో విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం మొత్తం రూ.586 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా తొలి దశలో రూ.351 కోట్లతో చేపట్టనున్న పనులకు ముఖ్యమంత్రి శ్రీరామనవమి రోజునే భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు.

## హిందూ పండుగలకు అనుమతులివ్వడం లేదు

**బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆగ్రహం**

నిర్మల్, మార్చి 27 (ఈవార్తలు): హిందూ పండుగలకు తెలంగాణ ప్రభుత్వం, పోలీసులు అనుమతులు ఇవ్వడం లేదని, కోర్టులకు వెళ్లి అనుమతులు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మల్ పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందువులపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. అయినప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదని అన్నారు. నిర్మల్ ఎస్పీ హిందువులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి దమ్మంటే గంజాయి, డ్రగ్స్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని సవాల్ చేశారు. ఎస్పీపై చర్యల కోసం అసెంబ్లీలో ప్రివిలేజ్ మోషన్ ఇస్తామని తెలిపారు. హిందువులు ఇన్నాళ్లు శాంతియుతంగా ఉన్నారని, ఇక నుంచి సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో జరుగుతున్న పరిణామాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళతానని అన్నారు.



## నేడు బీఆర్ఎస్వీ సమావేశం

**ముఖ్య అతిథిగా హాజరుకానున్న కేటీఆర్**

హైదరాబాద్, మార్చి 27 (ఈవార్తలు) : తెలంగాణ భవన్‌లో శనివారం బీఆర్ఎస్వీ గ్రేటర్ హైదరాబాద్ సమావేశం నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు.




## ఘనంగా సీతారాముల కల్యాణం

కొడిమ్యాల, మార్చి 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం అప్పారావుపేట గ్రామంలో సీతారాముల అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామంలోని హనుమాన్ టెంపుల్ వద్ద ముత్యాల పందిరి వేసి సీతారామ కల్యాణాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బండ వీనిలా-నర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ రేకుపల్లి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో రేకులపల్లి రవీందరరెడ్డి-లత, బండ గోపాలరెడ్డి -ఇజ్జవ్వ చేతుల మీదుగా కల్యాణ ఘట్టం వైభవంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలందరూ పాల్గొన్నారు.

## కొండగట్టులో అట్టహాసంగా రామయ్య పెండ్లి

మల్యాల, మార్చి 27 (ఈవార్తలు): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో శ్రీ సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కపిందర్, ఉప ప్రధాన అర్చకుడు చిరంజీవి ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ శ్రీ సీతారాముల కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ మహత్తర ఘట్టాన్ని వీక్షించేందుకు హనుమాన్ దీక్షాస్వాములు, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దీంతో గుట్ట మీద కాషాయ రంగు దగద్ధయమానంగా మెరిసిపోయింది. భక్తులు పెద్ద ఎత్తున రావడంతో ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో అంజనారెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు.

# కల్యాణం.. కమనీయం!

### సీతమ్మ మెడలో రామయ్య మూడు ముళ్లు

### బల్వంతాపూర్‌లో ఘనంగా సీతారాముల కల్యాణం

### తరలివచ్చిన భక్త జనం.. మార్మోగిన రామ నామం

మల్యాల, మార్చి 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం బల్వంతాపూర్ గ్రామంలో శ్రీ భక్తాంజనేయస్వామి సన్నిధి స్వర్గపురిని తలపించింది. శ్రీసీతారాములు స్వయంగా భూమ్మీదికి వచ్చి పరిణయం ఆడుతున్నట్లుగా ఆధ్యాత్మిక శోభ ఆవరించింది. పెళ్లి మండపంలో రామయ్య, సీతమ్మలు కొలువుదీరగా, అశేష భక్త జనం ముందు దేవదేవులు మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. లోకహితమై నిర్వహించిన ఈ మహత్తర ఘట్టం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం రామ నామ స్మరణతో మార్మోగింది. హనుమాన్ దీక్షా స్వాముల భజనలతో, వేదపండితుల వేదమంత్రాల ఘోషతో పెళ్లి మండపం భక్తిపారవశ్యంతో ఊగిపోయింది. సీతారాములను దర్శించుకొనేందుకు గ్రామస్థులు, చుట్టు పక్కల ప్రాంతాల భక్తులు భారీగా తరలివచ్చారు. అంజన్న సన్నిధిలో పురోహితులు యజ్ఞం నిర్వహించి, గ్రామం పాడిపంటలతో, అష్ట ఐశ్వర్యాలతో తూలతూగాలని ఆకాంక్షించారు. కల్యాణం అనంతరం ఆలయ కమిటీ అన్న ప్రసాద వితరణ చేపట్టింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కుంకుమ పూజ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం.. చిన్నాపెద్ద అన్న తేడా లేకుండా ప్రతీ ఒక్కరు పల్లకి సేవలో పాల్గొన్నారు. రాత్రి వేళ, మంగళ హారతుల కాంతుల్లో గ్రామం మెరిసి, మురిసింది. ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.





## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

ఖమ్మం మార్చి 27 (ఈవార్తలు): శ్రీరామనవమి పురస్కరించుకొని ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ పర్ణశాల వద్ద వాసవి క్లబ్ రోటరీ నగర్ ఆధ్వర్యంలో భక్తులకు భారీగా మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కడవెండి శ్రీనివాస్ అతిథిగా పాల్గొన్నారు. ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ మాశెట్టి వరప్రసాద్, కొదమూరి జగన్నాథం, రీజియన్ చైర్మన్ దాస శ్రీనివాసరావు, క్లబ్ ప్రెసిడెంట్ కాజా వెంకటేశ్వరరావు, సెక్రెటరీ కల్వకుంట్ల వెంకట్రావు, ట్రెజరర్ వంశి క్లబ్ మాజీ అధ్యక్షులు శేషగిరిరావు, పాల్వాయి వెంకటేశ్వరరావు, నూనె గోపాలరావు, కల్వకుంట్ల హనుమంతరావు, రాయల బసవేశ్వర రావు, పాల్వాయి నాగేశ్వరరావు, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మిడివరపాడు బండిపేటలో ఘనంగా శ్రీరామనవమ

కాకినాడ, మార్చి 27 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా ముమ్మిడివరపాడు బండి పేటలో శ్రీరామనవమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో ఉదయం నుంచే ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవదేవులను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని జనసేన నాయకుడు అధ్యక్షుడు బండి రమణ, ఆధ్వర్యంలో నిర్వహించగా, బండి జోగ్రాజు-బండి లక్ష్మి దంపతులు సంప్రదాయబద్ధంగా కల్యాణ కార్యక్రమాన్ని జరిపించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. వేడుకల్లో జనసేన సీనియర్ నాయకుడుబండి సీతయ్య కాపు, బండి కొండ రాజులు, ముమ్మిడి చక్రరావు, బండి అప్పారావు, గ్రామ ప్రజలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

**ముమ్మిడివారి పోడులో ఘనంగా సీతారాముల కల్యాణం**

ముమ్మిడివారి పోడులో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. జనసేన నాయకుడు ముమ్మిడి తమ్మారావు ఆధ్వర్యంలో ముమ్మిడి అప్పారావు--ముమ్మిడి రామలక్ష్మి దంపతులు సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. శ్రీరాంపురంలోనూ శ్రీరామనవమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పిర్ల వెంకట బాబ్జి--మంగ దంపతులు స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.



## బజరంగ్ సేన ఆధ్వర్యంలో మజ్జిగ, పులిహోర పంపిణీ

హైదరాబాద్, మార్చి 27 (ఈవార్తలు): శ్రీరామనవమి సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే శ్రీరామ శోభాయాత్రలో బజరంగ్ సేన కీలకంగా వ్యవహరించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవాకార్యక్రమాలు చేపట్టింది. భక్తుల కోసం మజ్జిగ ప్యాకెట్లు, పులిహోర ప్యాకెట్లను అందుబాటులో ఉంచింది. ఈ సందర్భంగా బజరంగ్ సేన ఎన్ఆర్ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ..రామ భక్తులకు సేవ చేయడం ఎంతో తృప్తిని ఇస్తుందని, ఎన్నో ఏళ్లుగా తాము ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మనోజ్ మొగల్‌గిడ్డి, నరేశ్, గణేశ్ యాదవ్, నందు, వీరేశ్, కొండారెడ్డి, గుణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పామాపురం శ్రీరామనవమి

# వేడుకలో మత సామరస్యం

వనపర్తి, మార్చి 27 (ఈవార్తలు): వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పామాపురం గ్రామంలో జరిగిన శ్రీరామ నవమి వేడుకలో మత సామరస్యం వెల్లివిరిసింది. గ్రామంలోని భక్తాంజనేయ దేవాలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా జరిగిన సీతమ్మ-రామయ్య తలంబ్రాల కార్యక్రమం ఇందుకు వేదికైంది. గ్రామానికి చెందిన మండల మైనారిటీ కో ఆప్షన్ మాజీ సభ్యులు అల్లా భాషా, డాక్టర్ అల్లిపిర్ తదితరులు నవమి వేడుకలో ఉత్సాహంగా పాల్గొని మత సామరస్యాన్ని చాటి చెప్పారు. ఇటు శ్రీరామ నవమి అయినా అటు వినాయక చవితి అయినా ఇలా ఏ పండుగ వచ్చినా అల్లా భాషా భక్తితో పాల్గొంటూ తనవంతుగా సేవలు అందిస్తున్నారు. శ్రీరామ నవమి రోజున భక్తుల నుంచి చదివింపులను రాబట్టడంలో తన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ప్రభ కార్యక్రమంలోనూ పాల్గొనడమే కాక కల్యాణ వేడుక ముగిసేంత వరకు దగ్గరుండి భక్తులకు సేవలు



అందించారు. ఇందుకుగానూ ఆయనను నిర్వాహకులు ప్రత్యేకంగా సత్కరించారు. గ్రామ యువకుడు వారణాసి సుధాకర్‌తో పాటు కొందరు గ్రామస్థులు అల్లా భాషా సేవలను, డాక్టర్ అల్లిపిర్ మత సామరస్యాన్ని గుర్తు చేస్తూ వారిని అభినందించారు. కార్యక్రమంలో గొల్ల రామచందరయ్య, శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ బస్సా ఉమా మహేశ్వర్ రెడ్డి, అయ్యపు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురం బస్సు ప్రమాదం.. బస్సు యజమాని అరెస్ట్

ప్రకాశం,మార్చి 27 (ఈవార్తలు): ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం తెలుగు రాష్ట్రాలను కలచివేసింది. 14 మంది ప్రాణాలను బలిగొన్న ఈ విషాద ఘటనపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ప్రాథమిక విచారణలో తేలడంతో, బస్సు డ్రైవర్ యువరాజుతో పాటు యజమాని హరికృష్ణను పోలీసులు అరెస్ట్ చేశారు. డ్రైవర్‌ను ప్రధాన నిందితుడిగా చేరుస్తూ సెక్షన్ 304ఏ కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వీరిద్దరిని పోలీసులు విచారిస్తున్నారు. విచారణ ముగిసిన అనంతరం కోర్టులో హాజరుపరచనున్నారు. కోర్టు వీరికి రిమాండ్ విధించే అవకాశం ఉంది. టిప్పర్ లారీని ఢీకొట్టిన ఈ ప్రమాదంలో 13 మంది సజీవ దహనం కాగా, చికిత్స పొందుతూ ఒక బాలుడు మరణించాడు.

## రాజ్ కేసిరెడ్డి ఆస్తుల జప్తుకు ఆదేశం

అమరావతి, మార్చి 27 (ఈవార్తలు): ఏపీలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కేసిరెడ్డి చుట్టూ ఉచ్చు మరింత బిగుస్తోంది. మద్యం స్కామ్ ద్వారా వచ్చిన ముడుపులతో రాజ్ కేసిరెడ్డి తన తల్లిదండ్రుల పేరిట తెలంగాణలోని జనగామ, షాబాద్ ప్రాంతాల్లో భారీగా భూములు కొనుగోలు చేసినట్లు సిట్ గుర్తించింది. ముఖ్యంగా షాబాద్‌లో తన తల్లి కేసిరెడ్డి సుభాషిణి పేరుతో కొన్న 17.60 ఎకరాల భూమి అసలు మార్కెట్ విలువ దాదాపు రూ. 70 కోట్లు కాగా, రిజిస్ట్రేషన్ సమయంలో కేవలం రూ. 2.69 కోట్లుగా చూపించారు. అలాగే జనగామలో తండ్రి ఉపేంద్ర రెడ్డి పేరుతో లక్షల విలువైన ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ బినామీ ఆస్తులన్నింటినీ జప్తు చేసేందుకు విజయవాడలోని ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు సిట్ సిద్ధమైంది. ఇప్పటికే ఈ కేసులో రాజ్ కేసిరెడ్డికి సంబంధించి వందల కోట్ల విలువైన ఆస్తులను ఈడీ, సిట్ అటాచ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కొత్తగా గుర్తించిన రూ. 70 కోట్లకు పైగా విలువైన ఆస్తులను జప్తు చేసేందుకు విజయవాడలోని ఏసీబీ కోర్టులో పిటిషన్ వేయాలని సిట్ నిర్ణయించింది. దీనికోసం అనుమతిని కోరగా... ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# పండుగల కు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు

**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం.. గంగాధర మండలంలో శ్రీరామ నవమి వేడుకలకు హాజరు**

గంగాధర, మార్చి 27 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని ఉప్పరమల్యాల, కురిక్యాల, మధురానగర్ గ్రామాల్లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, పురోహితులు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక పూజలు చేశారు. ఉప్పరమల్యాలలో కొండగట్టు దేవాలయం నుంచి వచ్చిన పట్టు వస్త్రాలను స్వామివారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం పండుగలకు ప్రత్యేక గుర్తింపునిస్తోందని పేర్కొన్నారు. ప్రజలు శ్రీరామనవమి వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, మండల సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, కురిక్యాల సర్పంచ్ కాదరి హారిక కనుకయ్య, వేముల భాస్కర్,రెండ్ల శ్రీనివాస్, బాసవేణి శ్రీనివాస్,కర్ర బాపు రెడ్డి,మేర్జ కొండయ్య, గుండారపు మధు,కనకట్ల తిరుపతి, కర్ర కార్తిక్ రెడ్డి, మ్యాక వినోద్,గుండారపు సంపత్,అదుర్తి ఎల్లయ్య, రాగుల సుధాకర్,శనిగరపు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## 'సఖి నివాస్' ద్వారా ఏపీలో మరిన్ని మహిళా వసతి గృహాలు: కేంద్రం

కాకినాడ' మార్చి 27: 'సఖి నివాస్' పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నత చదువులు, శిక్షణ, ఉద్యోగాల రిత్యా గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు వలస వస్తున్న మహిళలకు అన్ని వసతులతో, భద్రతకు పెద్దపీట వేస్తూ మరిన్ని వసతి గృహాలు ఏర్పాటుకు కేంద్రం సుముఖంగా ఉందని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సావిత్రి ఠాకూర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో మహిళా వసతి గృహాలు పనితీరు, కేటాయించిన నిధులు, కొత్త ప్రతిపాదనలపై శుక్రవారం కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బదులిచ్చారు. 'సఖి నివాస్' పథకం ద్వారా ఏపీలో వివిధ ప్రాంతాల్లో ప్రస్తుతం 23 మహిళా వసతి గృహాలు అందుబాటులో ఉండగా , గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చిన ప్రతిపాదనల మేరకు కొత్తగా మరో 30 వసతి గృహాల ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. మహిళా వసతి గృహాల్లో నిరంతరం సిసి టీవీలతో నిఘా, త్రాగునీరు, వైఫై కనెక్టివిటీ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. 'సఖి నివాస్' పథకాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు కేంద్ర మంత్రిత్వ శాఖ నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, రాష్ట్రాలతో వర్చువల్ గా సమావేశాలు, ఫీల్డ్ విజిట్లు, డిజిటల్ సమీక్షల ద్వారా ఎప్పటికప్పుడు సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రమంత్రి వివరించారు.

# రఘురామకృష్ణరాజుపై దాడికి యత్నం

పశ్చిమగోదావరి, మార్చి 27 (ఈవార్తలు): ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజుపై కొందరు వ్యక్తులు రాళ్లు, మేకులతో దాడికి యత్నించారు. శ్రీరామనవమి వేడుకల సందర్భంగా ఈ ఘటన జరగడం స్థానికంగా కలకలం రేపింది. పూర్తి వివరాల్లోకి వెళితే... ఆకివీడులోని స్థానిక రామాలయ స్థలానికి సంబంధించి గత కొంతకాలంగా రెండు వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. శ్రీరామనవమిని పురస్కరించుకుని స్థానికుల ఆహ్వానం మేరకు రఘురామరాజు ఆలయాన్ని సందర్శించేందుకు వెళ్లారు. ఆయన రాకను వ్యతిరేకిస్తూ ఒక వర్గానికి చెందిన వారు ఒక్కసారిగా నినాదాలు చేస్తూ రాళ్ల దాడికి దిగారు. దాడి సమయంలో రఘురామరాజుకు రక్షణగా నిలిచిన కూటమి నేతలపై నిందితులు రాళ్ళు, మేకులతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ పెనుగులాటలో పలువురు కూటమి నాయకులకు గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, పోలీసులు రఘురామరాజును సురక్షితంగా అక్కడి నుండి తరలించారు. ఘటన అనంతరం ఆకివీడులో అదనపు బలగాలను మోహరించారు. పరిస్థితిని సమీక్షిస్తున్న పోలీసులు... దాడికి పాల్పడిన వారిని గుర్తించే పనిని ముమ్మరం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణంలో ఆంక్షలు విధించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరించారు.



**నాపై హత్యాయత్నం జరిగింది: రఘురామకృష్ణరాజు**

దాడిపై రఘురామ స్పందిస్తూ... తనపై జరిగిన దాడి కేవలం ఆకస్మికం కాదని, అది ముందస్తుగా ప్లాన్ చేసిన హత్యాయత్నం అని ఆరోపించారు. గురువారం సాయంత్రమే బయటి ప్రాంతాల నుంచి కొందరు వ్యక్తులు ఆకివీడుకు చేరుకున్నారని, రాళ్లు, కత్తులు, మేకులతో తనపై దాడి చేసేందుకు వాళ్లు వచ్చారని ఆయన పేర్కొన్నారు. వందేళ్ల చరిత్ర ఉన్న ఈ రామాలయాన్ని ఒక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, వారు హిందువులే అయినప్పటికీ వేరే మతం ముసుగులో ఉన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆలయాన్ని శుభ్రం చేయడానికి కూడా వారు అభ్యంతరం చెబుతున్నారని తెలిపారు. దాడి చేసిన వారు రామ భక్తుల వేషంలో ఉండి ఒక్కసారిగా విరుచుకుపడ్డారని, తృటిలో తాను ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నానని వెల్లడించారు. లేనిపక్షంలో పరిస్థితి దారుణంగా ఉండేదన్నారు. ఇలాంటి వికృత చేష్టలను ఆదిలోనే అరికట్టకపోతే అవి సమాజానికి పెద్ద ముప్పుగా మారతాయని రఘురామ హెచ్చరించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించానని, వారిపై పోలీసులు కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**దాడిలో కుట్ర కోణం: పవన్ కల్యాణ్**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై జరిగిన దాడిని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. పండుగ రోజున, ఆలయం వద్ద జరిగిన ఈ దాడి వెనుక కుట్ర కోణం ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులోని రామాలయంలో పూజలకు వెళుతున్న సమయంలో రఘురామకృష్ణరాజు, ఆయన అనుచరులు, జనసేన నాయకులపై కొందరు వ్యక్తులు ఆయుధాలతో దాడికి పాల్పడ్డారని పవన్ వెల్లడించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. "హిందువులు అత్యంత పవిత్రంగా జరుపుకొనే శ్రీరామ నవమి రోజున ఈ దాడి జరగడం దారుణం. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు.

# భారత్‌కు తుంగుస్కా




**డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులను వేటాడే వ్యవస్థ**

**రష్యాతో భారత్ కీలక ఒప్పందం**

న్యూఢిల్లీ: భారత సైనిక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ మంత్రిత్వ శాఖ శుక్రవారం రెండు కీలక ఒప్పందాలను ఖరారు చేసింది. మొత్తం రూ.858 కోట్ల విలువైన ఈ కాంట్రాక్టులపై రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందాల ద్వారా ఆర్మీకి అత్యాధునిక క్షిపణి వ్యవస్థలు, నేవీ విమానాలకు స్వదేశీ నిర్వహణ సేవలు అందనున్నాయి. వివరాల్లోకి వెళితే, భారత సైన్యం కోసం రష్యాకు చెందిన 'జేఎస్‌సీ రోసోబోరోన్‌ఎక్స్‌పోర్ట్' సంస్థ నుంచి రూ.445 కోట్లతో తుంగుస్కా ఎయిర్ డిఫెన్స్ క్షిపణి వ్యవస్థలను కొనుగోలు చేయనున్నారు. విమానాలు, డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణుల వంటి గగనతల ముప్పుల నుంచి దేశానికి బహుళస్థాయి రక్షణ కల్పించేందుకు ఈ వ్యవస్థలు ఉపయోగపడతాయి. ఈ ఒప్పందం ఇండో-రష్యా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రెండో ఒప్పందాన్ని బోయింగ్ ఇండియా డిఫెన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కుదుర్చుకున్నారు. దీని విలువ రూ.413 కోట్లు. భారత నౌకాదళానికి చెందిన పీ-8ఐ లాంగ్-రేంజ్ సముద్ర నిఘా విమానాల నిర్వహణ, మరమ్మతుల కోసం ఈ కాంట్రాక్ట్ కుదిరింది. 'బై ఇండియన్' కేటగిరీ కింద, 100 శాతం స్వదేశీ కంటెంట్‌తో ఈ ఒప్పందం కుదరడం విశేషం. ఇది 'ఆత్మనిర్భర్ భారత్', 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యాలకు అనుగుణంగా ఉందని ప్రభుత్వం పేర్కొంది. 'హిందూ మహాసముద్రానికి కాపలాదారు'గా పిలిచే పీ-8ఐ విమానాలు సముద్ర గస్తీ, జలాంతర్గాములను గుర్తించడంలో భారత నౌకాదళంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రస్తుతం 12 విమానాలు సేవలందిస్తుండగా, భవిష్యత్తులో మరో 6 విమానాలను సమకూర్చుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

**ఏమిటీ తుంగుస్కా సిస్టమ్**

ఆధునిక యుద్ధ తంత్రంలో పెరిగిపోతున్న డ్రోన్లు, తక్కువ ఎత్తులో ప్రయాణించే విమానాలు, హెలికాప్టర్లు, క్రూయిజ్ క్షిపణుల ముప్పును సమర్థంగా ఎదుర్కొనేందుకు తుంగుస్కా వ్యవస్థలు భారత సైన్యానికి అదనపు బలాన్ని చేకూర్చనున్నాయి. తుంగుస్కా అనేది ఒకే ప్లాట్‌ఫామ్‌పై క్షిపణులు, ఆటోకెనాన్లు (అత్యంత వేగంగా బుల్లెట్లను ప్రయోగించే భారీ తుపాకులు) రెండింటినీ కలిగిన ఒక హైబ్రిడ్ వ్యవస్థ. ఇది భూతల దళాలకు సమీప గగనతలంలో పటిష్టమైన రక్షణ కవచంగా పనిచేస్తుంది. ఈ కొత్త కొనుగోలుతో దేశంలోని బహుళస్థాయి వాయు రక్షణ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టం చేయాలన్నది భారత ప్రభుత్వ వ్యూహాత్మక లక్ష్యం. సోవియట్ యూనియన్ హయాంలో రూపుదిద్దుకున్న ఈ తుంగుస్కా వ్యవస్థలు అనేక ప్రత్యేకతలను కలిగి ఉన్నాయి. 1982లో పాతతరం 'షిల్కా' వ్యవస్థల స్థానంలో ఇవి సైన్యంలోకి ప్రవేశించాయి. ఈ వ్యవస్థలో 8 నుంచి 10 కిలోమీటర్ల పరిధి గల 9ఎం311 క్షిపణులు ఎనిమిది ఉంటాయి. వీటితో పాటు, సమీపంలోని లక్ష్యాల కోసం 4 కిలోమీటర్ల పరిధి కలిగిన రెండు 30 ఎంఎం ఆటోకెనాన్లు అమర్చి ఉంటాయి. ఈ కెనాన్లు నిమిషానికి 3,900 నుంచి 5,000 రౌండ్ల వరకు కాల్పులు జరపగలవు. దీనికి అమర్చిన రాడార్ వ్యవస్థ 18 కిలోమీటర్ల దూరంలోని శత్రు లక్ష్యాలను గుర్తించి, 16 కిలోమీటర్ల దూరం నుంచే వాటిని ట్రాక్ చేయగలదు. నలుగురు సిబ్బందితో పనిచేసే ఈ వ్యవస్థ, ట్యాంకుల తరహా ట్రాక్డ్ ఛాసిస్‌పై గంటకు 65 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. రష్యా-జార్జియా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాల్లో ఈ వ్యవస్థలను విస్తృతంగా ఉపయోగించారు. కాలక్రమేణా తుంగుస్కా-ఎం, తుంగుస్కా-ఎం1 వంటి ఆధునిక వేరియంట్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం రష్యా సైన్యం దీని స్థానంలో మరింత అధునాతనమైన 'పాంట్‌సిర్-ఎస్' వ్యవస్థలను ప్రవేశపెడుతోంది.

# ఇరాన్‌లో 1,900 మంది మృతి

**అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో మృత్యు ఘోష**

టెహ్రాన్: అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్‌లో 1,900 మందికి పైగా మరణించారని ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గత నెల ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇప్పటివరకు అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో సుమారు 20,000 మంది గాయపడ్డారని తెలుస్తోంది. ఇరాన్ చేసిన ప్రతీకార దాడుల్లో ఇజ్రాయెల్‌లో 18 మంది, గల్ఫ్‌లో 20 మంది మృతి చెందారు. 13 మంది అమెరికన్ సైనికులు కూడా మృతి చెందారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 1,100 మందికి పైగా మరణించారని అక్కడి అధికారులు తెలిపారు. ఇరాక్‌లో మరో 80 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దీర్ఘ, మధ్యశ్రేణి క్షిపణులను ప్రయోగించినట్లు ఐఆర్జీసీ తెలిపింది. ఈ దాడుల్లో బహ్రెయిన్‌లోని అమెరికా పేట్రియాట్ వైమానిక రక్షణ వ్యవస్థ నిర్వహణ కేంద్రం ధ్వంసమైనట్లు తెలిపింది.

# స్టాక్ మార్కెట్లకు భారీ నష్టాలు




ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాల్లో ముగిశాయి. రెండు రోజుల వరుస లాభాలకు బ్రేక్ వేస్తూ సూచీలు కుప్పకూలాయి. మధ్యప్రాచ్యంలో నెలకొన్న అనిశ్చితి ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరుగుతున్న చర్చలపై నెలకొన్న ఉత్కంఠతో పెట్టుబడిదారులు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా, సెన్సెక్స్ 1,690.25 పాయింట్లు నష్టపోయి 73,583.22 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 486.85 పాయింట్లు క్షీణించి 22,819.60 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 షేర్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అత్యధికంగా 4.55 శాతం నష్టపోయింది. బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు కూడా భారీగా పతనమయ్యాయి. అయితే, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, పవర్ గ్రిడ్ షేర్లు మాత్రం లాభాల్లో ముగియడం గమనార్హం. రంగాల వారీగా చూస్తే, ఐటీ మినహా అన్ని సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంకులు, రియాల్టీ, ఆటో షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది. బ్రాడర్ మార్కెట్లలోనూ ఇదే ట్రెండ్ కొనసాగింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.24 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.88 శాతం మేర నష్టపోయాయి. ప్రస్తుత మార్కెట్ అనిశ్చితి దృష్ట్యా, సూచీలు పెరిగినప్పుడు అమ్మకాలు జరపడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. నిఫ్టీ 23,500 స్థాయికి చేరినప్పుడు అమ్మకాల ఒత్తిడి ఎదురుకావచ్చని, ఒకవేళ 22,800 స్థాయిని కోల్పోతే మార్కెట్ మరింత బలహీనపడే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# నార్డ్‌స్ట్రీమ్ పైప్‌లైన్ స్వాధీనానికి అమెరికా కుట్ర

**రష్యా సంచలన ఆరోపణలు**

మాస్కో: అమెరికాపై రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నార్డ్‌స్ట్రీమ్ పైప్‌లైన్‌ను అమెరికా స్వాధీనం చేసుకోవాలని భావిస్తోందని ఆరోపించారు. ఫ్రాన్స్ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఇంధన మార్కెట్‌పై ఆధిపత్యం కోసం అమెరికా ప్రయత్నిస్తోందని అన్నారు. ఇందులో భాగంగా యూరప్‌కు సరఫరా చేసే గ్యాస్ పైప్‌లైన్‌లను తమ చేతుల్లోకి తీసుకోవాలని చూస్తోందని అన్నారు. శీతాకాలంలో యూరప్ ఖండానికి రష్యా నుంచి గ్యాస్ సరఫరాలో నార్డ్ స్ట్రీమ్‌ది కీలకపాత్ర. జర్మనీకి సహజ వాయువును తీసుకువచ్చేందుకు బాల్టిక్ సముద్రంలో నార్డ్ స్ట్రీమ్ గొట్టపు మార్గాలను నిర్మించింది. 2022లో ఈ పైప్‌లైన్‌లలో లీకేజీలు కనిపించాయి. పేలుళ్ల కారణంగా లీకేజీలు వచ్చాయని భావించారు. పేలుళ్లకు సంబంధించి దర్యాప్తు చేసినప్పటికీ ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ విధ్వంసం వెనుక అమెరికా హస్తం ఉందని రష్యా గతంలోనే ఆరోపించింది. ఇప్పుడు నార్డ్ స్ట్రీమ్ పైప్‌లైన్‌ను స్వాధీనం చేసుకోవాలని చూస్తోందని ఆ దేశ మంత్రి వ్యాఖ్యానించారు.

# వాణిజ్య విమానాలు డేంజర్

**50% విమానాల్లో సాంకేతిక లోపాలు.. స్టాండింగ్ కమిటీ ఆన్ సివిల్ ఏవియేషన్**

న్యూఢిల్లీ: దేశంలోని 50 శాతం వాణిజ్య విమానాల్లో సాంకేతిక లోపాలు ఉన్నాయని స్టాండింగ్ కమిటీ ఆన్ సివిల్ ఏవియేషన్ తాజాగా వెల్లడించింది. ఏడాదికాలంగా చేపట్టిన తనిఖీల్లో వాటిని గుర్తించినట్లు వెల్లడించింది. తరుచూ అవే సాంకేతిక సమస్యలు వెలుగు చూస్తున్నాయని పేర్కొంది. 2025 జనవరి నుంచి 2026 ఫిబ్రవరి వరకు 754 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా 377 వాటిల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపింది. ఆడిట్ చేసిన వాటిల్లో ఇండిగో విమానాల సంఖ్య ఎక్కువగా ఉందని, లోపాలు కూడా వాటిలోనే అధికంగా ఉన్నట్లు కమిటీ తెలిపింది. ఫిబ్రవరి 3వ తేదీ వరకు 405 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా, 148 ఫ్లైట్‌లలో లోపాలు ఉన్నాయని తెలిపింది. కొన్ని లోపాలు రిపీట్ అయినట్లు పేర్కొంది. 166 ఎయిరిండియా, 101 ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాల్లో తనిఖీలు చేపట్టగా, వాటిలోనూ లోపాలు వెలుగుచూశాయి. దాదాపు సగం లోపాలు ఈ రెండు విమానయాన సంస్థలకు చెందిన వాటిల్లోనే ఉన్నట్లు తెలిపింది. ఈ స్థాయిలో లోపాలు వెలుగుచూడటంపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఇవి ప్రయాణికుల భద్రత, సంస్థల విశ్వసనీయతపై ప్రభావం చూపిస్తాయని హెచ్చరించింది. గత సంవత్సరం అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదం తర్వాత ఎయిరిండియాపై డీజీసీఏ నిర్వహించిన ఆడిట్‌ను కూడా నివేదిక ప్రస్తావించింది.

# ఇరాన్‌కు పంట పండుతోంది!

**చమురు ద్వారా రోజూ రూ.1310 కోట్ల ఆదాయం**

టెహ్రాన్: అమెరికా, ఇజ్రాయెల్‌తో ఓపక్క యుద్ధం జరుగుతున్నా, మరోపక్క ఇరాన్‌కు చమురు ఆదాయం మాత్రం పెరుగుతోంది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి చమురు విక్రయాల ద్వారా ఇరాన్ వందల మిలియన్ల డాలర్ల అదనపు ఆదాయాన్ని ఆర్జించినట్లు తెలుస్తోంది. హర్మూజ్ జలసంధిని ఉపయోగించుకోగలుగుతున్న ఏకైక ప్రధాన ఎగుమతిదారుగా ఇరాన్ మారడంతో పెరిగిన ముడి చమురు ధరల వల్ల టెహ్రాన్ భారీగా లాభపడుతోంది. యుద్ధం కారణంగా ఇరాన్ రెట్టింపు ప్రయోజనం పొందుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లు దాటగా, ఇరాన్ తన చమురును గత 10 నెలల్లో ఎన్నడూ లేనంత తక్కువ డిస్కౌంట్‌కు విక్రయిస్తోంది. ఆశ్చర్యకరంగా, ఇరాన్ ఆర్థిక జీవనాడి అయిన చమురు మౌలిక సదుపాయాలపై అమెరికా దాడులు చేయడం లేదు. పైగా, ప్రపంచ ధరలను నియంత్రించేందుకు సముద్రంలోని ట్యాంకర్లపై ఉన్న ఇరాన్ చమురుపై ఆంక్షలను వాషింగ్టన్ తాత్కాలికంగా నిలిపివేయడం టెహ్రాన్‌కు మరింత కలిసొచ్చింది. "ట్రంప్ ప్రభుత్వం ఆచరణాత్మకంగా ఇరాన్‌ను చమురు అమ్మమని అడుగుతోంది" అని కొలంబియా యూనివర్సిటీ నిపుణుడు రిచర్డ్ నెఫ్యూ వ్యాఖ్యానించారు.

# గుజరాత్‌లో అవినీతి చెత్తను ఊడ్చేస్తాం

గాంధీనగర్: గుజరాత్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధికారంలోకి వస్తే క్షేత్రస్థాయి నుంచే అవినీతిని పూర్తిగా నిర్మూలిస్తామని ఆ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ కుమ్మక్కై రాష్ట్రాన్ని దోచుకుంటున్నాయని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఇప్పటివరకు గుజరాత్ ప్రజలకు సరైన ప్రత్యామ్నాయం లేదని, ఇప్పుడు ఆప్ రూపంలో అది అందుబాటులోకి వచ్చిందని కేజ్రీవాల్ అన్నారు. "ఈసారి చీపురు (ఆప్ గుర్తు) ఉపయోగించి పాత రాజకీయ వ్యవస్థను ఊడ్చివేయాలి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల తేదీలు ఇంకా ఖరారు కాలేదు. స్థానిక ఎన్నికల ప్రచారంలో భాగంగా పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌తో కలిసి కేజ్రీవాల్ మూడు రోజుల గుజరాత్ పర్యటనలో ఉన్నారు. గురువారం సౌరాష్ట్ర ప్రాంతంలోని లాల్‌పూర్‌లో జరిగిన 'విజయ్ విశ్వాస్ సభ'లో ఆయన ప్రసంగించారు. పంజాబ్‌లో తమ ప్రభుత్వం ప్రతి మహిళకు నెలకు రూ. 1,000, ప్రతి కుటుంబానికి రూ. 10 లక్షల బీమా, ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తోందని, గుజరాత్‌లోనూ వీటిని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో పంజాబ్‌లో కాంగ్రెస్, అకాలీదళ్-బీజేపీ కూటముల పాలనకు చరమగీతం పాడి ప్రజలు ఆప్‌కు 117 స్థానాలకు గాను 92 సీట్లు కట్టబెట్టారని గుర్తుచేశారు. అదేవిధంగా గుజరాత్‌లో రాబోయే పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో తమకు ఒక్క అవకాశం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గెలిచిన వెంటనే క్షేత్రస్థాయి నుంచి అవినీతిపై పోరాటం మొదలుపెడతామని పునరుద్ఘాటించారు.

# అమెరికా సైనికులకు ఆశ్రయమిస్తే చావే గతి

**గల్ఫ్ హోటళ్లకు ఇరాన్ అల్టిమేటం**

టెహ్రాన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ కీలక హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా సైనికులకు ఆశ్రయం కల్పిస్తున్న బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని హోటళ్లకు అల్టిమేటం ఇచ్చింది. అమెరికా సైనిక సిబ్బందికి ఆశ్రయం కల్పించడం కొనసాగిస్తే, ఆ హోటళ్లను చట్టబద్ధమైన సైనిక లక్ష్యాలుగా పరిగణిస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ సెమీ-అఫీషియల్ వార్తా సంస్థ ఫార్స్ ఒక కథనాన్ని ప్రచురించింది. పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్, దాని మిత్రపక్షాలు జరిపిన క్షిపణి దాడుల తర్వాత అమెరికా సైనికులు తమ స్థావరాలను వీడి ఈ ప్రాంతంలోని హోటళ్లలో తలదాచుకుంటున్నారని ఫార్స్ ఏజెన్సీ తన కథనంలో పేర్కొంది. విదేశీ సైనిక సిబ్బందికి ఆశ్రయం కల్పించే ఏ హోటల్‌కైనా ఈ హెచ్చరిక వర్తిస్తుందని తెలిపింది. ఈ విషయంపై ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరఘ్చి కూడా స్పందించారు. అమెరికా సైనికులు తమ స్థావరాల నుంచి పారిపోయి, పౌర ప్రాంతాలను కవచంగా వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. "ఈ యుద్ధం మొదలైనప్పటి నుంచి జీసీసీ (గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్) దేశాల్లోని సైనిక స్థావరాల నుంచి పారిపోయిన అమెరికా సైనికులు హోటళ్లు, కార్యాలయాల్లో దాక్కుంటున్నారు. వారు జీసీసీ పౌరులను మానవ కవచాలుగా ఉపయోగించుకుంటున్నారు" అని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడులు జరిపి, అప్పటి సుప్రీం లీడర్ అలీ ఖమేనీతో పాటు పలువురు సీనియర్ సైనిక కమాండర్లను హతమార్చాయి.



# హర్మూజ్‌లో చమురు ట్యాంకర్ ధ్వంసం

టెహ్రాన్: ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధంతో అట్టుడుకుతున్న పర్షియన్ గల్ఫ్‌లో మరోసారి ఉద్రిక్తత తారస్థాయికి చేరింది. హర్మూజ్ జలసంధిలో తమ నిబంధనలు ఉల్లంఘించి ప్రవేశించిన ఓ ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్జీసీ) క్షిపణులతో దాడి చేసి ధ్వంసం చేసింది. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దాడికి గురైన ట్యాంకర్ పాకిస్థాన్ జెండాతో ఉన్నట్లు పలు కథనాలు సూచిస్తున్నాయి. ఇరాన్ హెచ్చరికలను పెడచెవిన పెట్టి జలసంధిని దాటేందుకు ప్రయత్నించడంతోనే ఈ దాడి చేసినట్లు ఇరాన్ వర్గాలు తెలిపాయి. మరోవైపు, పాకిస్థాన్ జెండా చాటున చమురును అక్రమంగా అమెరికాకు తరలిస్తున్నారని, దానికి ప్రతీకారంగానే ఈ దాడి జరిగిందనే కథనాలు వినిపిస్తున్నాయి. ట్యాంకర్‌కు మంటలు అంటుకుని, పూర్తిగా ధ్వంసమైన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనలో సిబ్బంది ప్రాణనష్టంపై ఇంకా స్పష్టత రాలేదు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దళాలు దాడులు చేసినప్పటి నుంచి హర్మూజ్ జలసంధిని ఇరాన్ తన నియంత్రణలోకి తీసుకుంది. తమ అనుమతి లేకుండా ఏ నౌక ప్రవేశించరాదని ఆంక్షలు విధించింది. దీంతో ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం స్తంభించిపోగా, 85కి పైగా ట్యాంకర్లు గల్ఫ్‌లోనే చిక్కుకుపోయాయి. మార్చి 11న కూడా థాయ్‌లాండ్‌కు చెందిన నౌకపై దాడి జరిగింది. ఈ సంక్షోభం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లను దాటింది. తాజా ఘటనతో ఈ ప్రాంతంలో యుద్ధ మేఘాలు మరింత దట్టమయ్యాయి. సంక్షోభం ముదరకుండా దౌత్యపరమైన ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# ఇంధన ఎగుమతులపై భారీగా పన్ను

**చమురు కంపెనీలకు చెక్ పెట్టిన కేంద్రం**



న్యూఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధం కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో ముడిచమురు ధరలు మండిపోతున్న తరుణంలో, కేంద్ర ప్రభుత్వం తన 'ఇండియా ఫస్ట్' పాలసీని మరోసారి చాటుకుంది. భారతీయ ఆయిల్ రిఫైనరీ కంపెనీలు అంతర్జాతీయంగా ఉన్న అధిక ధరల ఆశతో డీజిల్, విమాన ఇంధనాన్ని విదేశాలకు తరలించకుండా కేంద్రం అడ్డుకట్ట వేసింది. ఇందులో భాగంగా లీటర్ డీజిల్‌పై రూ. 21.5కి, విమాన ఇంధనంపై రూ. 29.5కి ఎగుమతి పన్నును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల రిఫైనరీ కంపెనీలకు విదేశాలకు ఎగుమతి చేయడం కంటే దేశీయ మార్కెట్‌కు సరఫరా చేయడమే లాభదాయకంగా మారుతుంది. తద్వారా మన దేశంలోని పెట్రోల్ బంకుల వద్ద ఏర్పడుతున్న కృత్రిమ కొరతకు చెక్ పడనుంది. ఈ నిర్ణయం ముఖ్యంగా రిలయన్స్, నయారా వంటి ప్రైవేట్ రిఫైనరీలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎందుకంటే వారు అంతర్జాతీయ మార్కెట్‌లో వచ్చే భారీ లాభాల కోసం ఎగుమతులకు ప్రాధాన్యత ఇస్తుంటారు. ఇప్పుడు ప్రభుత్వం విధించిన ఈ పన్ను వల్ల, వారు తప్పనిసరిగా దేశీయ అవసరాలకే మొగ్గు చూపాల్సి ఉంటుంది. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం ఉన్నప్పటికీ, భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా కేంద్రం ఈ సాహసోపేతమైన అడుగు వేసింది.


# ఇరాన్ అణుప్లాంట్లపై దాడి

**ఆందోళన వ్యక్తం చేసిన ఐఏఈఏ**



టెహ్రాన్: పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణల నేపథ్యంలో, ఇరాన్‌లోని బుషెహర్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో జరిగిన దాడులపై అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అణు కేంద్రానికి జరిగే నష్టం, దీర్ఘకాలంలో రేడియోలాజికల్ ప్రమాదానికి దారితీయవచ్చని హెచ్చరించింది. ఇరాన్‌లోని బుషెహర్ న్యూక్లియర్ ప్లాంట్‌లో రేడియేషన్ లీకేజీ భయాలపై అంతర్జాతీయ అణుశక్తి సంస్థ స్పందించింది. ఆ ప్లాంట్‌లో పెద్ద మొత్తంలో అణుపదార్థాలు ఉన్నట్టు ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రఫేల్ గ్రాసి పేర్కొన్నారు. ఎక్కువ మొత్తంలో అణుపదార్థాలు నిల్వ ఉన్న ఇలాంటి న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌కు ప్రమాదం జరిగితే, రేడియేషన్ లీకేజీ వల్ల ఇరాన్‌తో పాటు ఆ దేశం వెలుపల భారీస్థాయిలో ప్రమాదం ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి ప్రమాదాన్ని నివారించేందుకు అన్ని పక్షాలు సంయమనం పాటించాలని సూచించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు. ఇరాన్ సైనిక స్థావరాలు, క్షిపణి తయారీ కేంద్రాలు, ఆయుధ నిల్వలు లక్ష్యంగా ఇజ్రాయెల్-అమెరికా దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈదాడుల్లో బుషెహర్ ప్రావిన్సులోని ఐఆర్జీసీ, నేవీ, వైమానిక స్థావరాల మౌలిక సదుపాయాలు ధ్వంసమైనట్లు శాటిలైట్ చిత్రాల ద్వారా వెల్లడైంది. ఈ దాడులు బుషెహర్ అణు విద్యుత్ ప్లాంట్‌కు సమీపంలోనే జరిగినట్లు వార్తలు వచ్చాయి. దీనితో రేడియేషన్ లీకేజీపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# లాక్‌డౌన్ ఉండదు: కేంద్రం




న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా మరోసారి లాక్‌డౌన్ విధిస్తారంటూ సోషల్ మీడియా సహా, కొన్ని వర్గాల్లో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ వార్తలు పూర్తిగా అవాస్తవమని, ప్రజలు ఆందోళన చెందవద్దని స్పష్టం చేసింది. దేశంలో లాక్‌డౌన్ విధించే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. ప్రజల్లో నెలకొన్న భయాలను తొలగించే లక్ష్యంతో ఆయన ఈ స్పష్టతనిచ్చారు. "భారత్‌లో లాక్‌డౌన్ విధిస్తారనే వదంతులు పూర్తిగా అవాస్తవం. ప్రభుత్వ పరిశీలనలో అలాంటి ప్రతిపాదన ఏదీ లేదు. ఇలాంటి సమయంలో ప్రజలు ప్రశాంతంగా, బాధ్యతాయుతంగా, ఐక్యంగా ఉండటం ముఖ్యం. వదంతులు వ్యాప్తి చేసి ప్రజలను భయాందోళనలకు గురిచేయడం బాధ్యతారహితమైన చర్య, హానికరం" అని హర్దీప్ సింగ్ పురి తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఇంధనం, సరఫరా వ్యవస్థలు, నిత్యావసరాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజలకు ఇంధనం, ఇతర నిత్యావసరాల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన భరోసా ఇచ్చారు.

వయ్యారి చిత్రం




అవనీత్ కౌర్

## తిరుమలలో సింపుల్‌గా బెల్లంకొండ పెళ్లి



టాలీవుడ్ యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ పెళ్లి వార్తలు ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. డెస్టినేషన్ వెడ్డింగ్స్ హడావుడిలో ఉన్న నేటి కాలంలో, ఈ యువ హీరో మాత్రం ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలలో అత్యంత నిరాడంబరంగా వివాహం చేసుకోవాలని నిర్ణయించుకోవడం విశేషం. బెల్లంకొండ శ్రీనివాస్ తన మనసు గెలిచిన అమ్మాయి కావ్యను మనువాడబోతున్నారు. ఈ నెల మొదట్లో జరిగిన ఒక ఫ్యామిలీ ఫంక్షన్‌లో ఆమెను పరిచయం చేసినప్పుడే అందరూ అది నిశ్చితార్థం అనుకున్నారు, కానీ అది కేవలం ఇరు కుటుంబాలు కలుసుకున్న సందర్భం మాత్రమేనని ఆయన క్లారిటీ ఇచ్చారు. ఇక ఇప్పుడు పెళ్లికి సంబంధించిన కీలక తేదీలు బయటకు వచ్చాయి. ఏప్రిల్ 5న హైదరాబాద్‌లో బెల్లంకొండ శ్రీనివాస్ – కావ్యల నిశ్చితార్థం ఘనంగా జరగనుంది. ఏప్రిల్ 29న కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి సాక్షిగా తిరుమలలో వీరిద్దరి వివాహం చాలా సింపుల్‌గా, కేవలం సన్నిహితుల సమక్షంలో జరగబోతోంది. మే 1న హైదరాబాద్‌లో టాలీవుడ్ ప్రముఖులు, రాజకీయ నాయకుల కోసం భారీ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు.




## పెద్ది.. పహిల్వాన్.. కుస్తీ యోధుడు!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే కానుక అందింది. ఆయన కథానాయకుడిగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది' నుంచి ఫస్ట్ గ్లింప్స్ విడుదలైంది. రామ్ చరణ్‌ను మునుపెన్నడూ చూడని అత్యంత రగ్గడ్, మాస్ అవతారంలో చూపించి దర్శకుడు బుచ్చిబాబు సినిమాపై ఆసక్తిని రేకెత్తించారు. ఈ గ్లింప్స్ ప్రారంభంలో వినిపించే 'కుస్తీ అంటే బ్యాట్‌తో బంతికి ఎదురెళ్లే ఆట కాదురా.. ప్రాణంతో చావుకి ఎదురెళ్లే ఆట' అనే సంభాషణ, ఇది కేవలం క్రీడా నేపథ్య చిత్రం కాదని, ఓ యోధుడి జీవన్మరణ పోరాటమని దర్శకుడు చెప్పకనే చెప్పాడు. ఈ పవర్‌ఫుల్ డైలాగ్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కుస్తీ, క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ డ్రామాలో చరణ్ పాత్ర ఎంతో శక్తివంతంగా ఉండబోతున్నట్టు ఈ గ్లింప్స్ హింట్ ఇచ్చింది.

## అంజనాద్రి సెట్‌లో జై హనుమాన్ షూటింగ్!

ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ ప్రాజెక్ట్ జై హనుమాన్ ఎట్టకేలకు పట్టాలెక్కినట్లు తెలుస్తోంది. గత కొన్ని నెలలుగా ప్రీ–ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న చిత్ర యూనిట్ తాజాగా హైదరాబాద్‌లో గ్రాండ్‌గా



షూటింగ్‌ను ప్రారంభించిరనట్లు ప్రచారం జరుగుతోంది. –హనుమాన్ పాన్ ఇండియాలో సాధించిన విజయం తర్వాత, దానికి కొనసాగింపుగా వస్తోన్న చిత్రంపై అంచనాలైతే భారీగానే ఉన్నాయి. ఈ సినిమా కోసం హైదరాబాద్ శివార్లలో ఒక భారీ ప్రత్యేకమైన సెట్‌ను రూపొందించారు. పురాతన అంజనాద్రి సామ్రాజ్యాన్ని తలపించేలా అత్యంత ఖరీదైన కళాఖండాలతో ఈ సెట్‌ను తీర్చిదిద్దినట్లు సమాచారం. ఈ షెడ్యూల్‌లో సినిమాలోని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ప్రశాంత్ వర్మ విజన్ ప్రకారం విజువల్స్ పరంగా ఈ సినిమా హాలీవుడ్ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా ఉండాలని టీమ్ రాత్రింబవళ్లు శ్రమిస్తోంది.

## 'సారీ' అలవాటు మానుకోండి



హీరోయిన్ సమంత రూత్ ప్రభు సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపై మరోసారి తన గళాన్ని బలంగా వినిపించారు. గుర్తింపు పొందాలన్నా, తమను తాము నిరూపించుకోవాలన్నా మహిళలు ప్రతిదానికీ రెట్టింపు కష్టపడాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సమంత.. మహిళల స్థితిగతులపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా పంచుకున్నారు. ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. సమాజంలో ఇతరుల సౌకర్యం కోసం మహిళలు తమ అభిప్రాయాలను, షెడ్యూళ్లను, చివరికి తమ ఆశయాలను కూడా త్యాగం చేయడం ఒక సాధారణ విషయంగా మారిపోయిందని సమంత పేర్కొన్నారు. తమ వ్యక్తిత్వాన్ని పక్కనపెట్టి ఇతరుల కోసం జీవించడం, వెనక్కి తగ్గడం మహిళలకు అలవాటైపోయిందని అన్నారు. ఈ త్యాగాలను చాలాసార్లు వారే గుర్తించలేని స్థితిలో ఉంటారని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మహిళలకు ఆమె ఒక ముఖ్యమైన పిలుపునిచ్చారు.

## శ్రీలీల పరిస్థితేంటో..!



టాలీవుడ్ సెన్సేషనల్ బ్యూటీ శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో ఒక గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. 'పెళ్ళి సందడి', 'ధమాకా' వంటి సినిమాలతో టాలీవుడ్‌లో తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్న ఈ భామకు, ఇటీవల వరుస పరాజయాలు పెద్ద దెబ్బ తీశాయి. తాజాగా విడుదలైన 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించకపోవడంతో శ్రీలీల ఆశలన్నీ అడియాశలయ్యాయి. ఒకప్పుడు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా వెలిగిన ఈమె చేతిలో ప్రస్తుతం ఒక్క క్రేజీ తెలుగు ప్రాజెక్ట్ కూడా లేకపోవడం గమనార్హం. అందుకే ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ తన దృష్టిని బాలీవుడ్ వైపు మళ్ళించింది. బాలీవుడ్ యంగ్ స్టార్ కార్తీక్ ఆర్యన్ సరసన ఒక భారీ ప్రాజెక్ట్‌లో నటించే అవకాశం దక్కించుకుంది. హిందీ మార్కెట్ లో ఈ సినిమా కనుక క్లిక్ అయితే, శ్రీలీల రేంజ్ మళ్ళీ మారిపోవడం ఖాయం. గ్లామర్ పరంగా, డ్యాన్స్ పరంగా బాలీవుడ్ ప్రేక్షకులను ఆకట్టుకోవడం శ్రీలీలకు పెద్ద కష్టమేమీ కాదు.

## వార్తలను చూసి నవ్వుకుంటున్నా



ఫిట్‌నెస్ ఐకాన్ మలైకా అరోరా వ్యక్తిగత జీవితంపై నిరంతరం పుకార్లు షికార్లు చేస్తూనే ఉంటాయి. అయినా వీటిని మలైకా ఎంతో లైట్ తీసుకుంటుంది. తాజాగా వీటిపై అమ్మడు మనసు విప్పి మాట్లాడారు. సెలబ్రిటీల జీవితాల్లో డేటింగ్ వార్తలు సర్వసాధారణం అయినప్పటికీ కొన్నిసార్లు అవి హద్దులు దాటి విసుగు తెప్పిస్తుంటాయని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే గతంలో ఇలాంటి వార్తలు తనను ఎంతో కలవరపెట్టేవని కానీ ఇప్పుడు వాటిని ఎదుర్కోవడంలో తన దృక్పథం పూర్తిగా మారిపోయిందన్నారు. మలైకా వచ్చే పుకార్లను ఇప్పుడు చాలా సరదాగా తీసుకుంటున్నారు. ముఖ్యంగా తన కుమారుడు అర్హాన్ ఖాన్ తో కలిసి ఆ వార్తలను చదువుతూ నవ్వుకుంటానని ఆమె వెల్లడించారు. –కొన్నిసార్లు నా గురించి వచ్చే కథనాలు ఎంత విడ్డూరంగా ఉంటాయంటే మేమిద్దరం వాటిని చూసి ఆశ్చర్యపోతుంటాం. ఆ వార్తల్లోని అసత్యాలను చూసి నవ్వుకోవడం ఇప్పుడు మాకు అలవాటైపోయింది– అని ఆమె చెప్పుకొచ్చారు. అర్హాన్ చాలా పరిణతి చెందిన వ్యక్తని, తన వ్యక్తిగత నిర్ణయాలను , తన చుట్టూ జరుగుతున్న పరిణామాలను వాడు సరిగ్గా అర్థం చేసుకుంటాడని మలైకా సంతోషం వ్యక్తం చేశారు.



## ధురంధర్ 2: వారంలోనే 1000 కోట్లు

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. విడుదలైన కేవలం ఏడు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 1000 కోట్ల గ్రాస్ వసూళ్ల మార్కును దాటింది. భారత్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతూ, అతి వేగంగా ఈ ఘనత సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ సినిమా ప్రయాణం ఈ నెల 18న పెయిడ్ ప్రివ్యూలతో ప్రారంభమైంది. ప్రివ్యూల ద్వారానే దేశవ్యాప్తంగా రూ. 43 కోట్ల నెట్ వసూలు చేసి సంచనాలకు తెరలేపింది. ఇక తొలి రోజు (ఖుఎ 1) ఏకంగా రూ. 102.55 కోట్లు రాబట్టి బాక్సాఫీస్ వద్ద తన ఆధిపత్యాన్ని చాటింది. రెండో రోజు శుక్రవారం నాడు స్వల్పంగా తగ్గి రూ. 80.72 కోట్లు వసూలు చేసినా, వారాంతంలో మళ్లీ పుంజుకుంది. శనివారం రూ. 113 కోట్లు, ఆదివారం రూ. 114.85 కోట్లతో అసాధారణ వృద్ధిని నమోదు చేసింది. దీంతో తొలి వారాంతానికే భారత్‌లో నెట్ కలెక్షన్లు రూ. 411 కోట్లు దాటాయి. వారపు రోజుల్లోనూ 'ధురంధర్' జోరు తగ్గలేదు. సోమవారం రూ. 65 కోట్లు, మంగళవారం రూ. 56.60 కోట్లు, ఏడో రోజైన బుధవారం రూ. 48.25 కోట్లు సాధించి స్థిరమైన వసూళ్లను కొనసాగించింది. మొత్తం ఏడు రోజులకు గాను భారత్‌లో ఈ చిత్రం రూ. 623.97 కోట్ల నెట్ కలెక్షన్లు (రూ. 745.23 కోట్ల గ్రాస్) సాధించింది.

## పెళ్లిపై మంచి అభిప్రాయం లేదు



టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్‌ను సంపాదించుకున్న సాయిపల్లవి... పెళ్లి గురించి, తన వ్యక్తిగత భావోద్వేగాల గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తనకు పెళ్లిపై పెద్దగా మంచి అభిప్రాయం లేదని ఆమె తెలిపింది. పెళ్లైన వారు కూడా పెళ్లి చేసుకోవద్దని తనకు సలహా ఇస్తున్నారని చెప్పింది. అందుకే తనకు పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేదని తెలిపింది. ఒంటరిగానే తాను చాలా ప్రశాంతంగా ఉన్నానని, ప్రస్తుతం తన దృష్టంతా సినిమాలపైనే ఉందని స్పష్టం చేసింది.



# ఇక మొదలెడదామా..!

## నేటి నుంచి ఐపీఎల్ సమ్మర్ ఫీస్ట్.. చిన్నస్వామిలో ఐపీఎల్ సందడి

### నెట్స్‌లో చెమటోడ్చిన ఆర్సీబీ, సన్‌రైజర్స్ క్రికెటర్లు

దాదాపు పది నెలలకు పైగా క్రికెట్ మ్యాచ్‌లకు దూరమైన చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ సందడి నెలకొంది. శనివారం నుంచి టోర్నీ షురూ కానున్నందున రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు మైదానంలోకి దిగారు. ఆరంభ పోరులో విజయమే లక్ష్యంగా ఇరుజట్ల క్రికెటర్లు శుక్రవారం నెట్స్‌లో తీవ్రంగా సాధన చేశారు. నిరుడు జూన్ 4న తొక్కిసలాటల ఘటనతో క్రికెట్ మ్యాచ్‌లకు నోచుకోని చిన్నస్వామి స్టేడియానికి పూర్వవైభవం వచ్చింది. కర్నాటక క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా ఎంపికవ్వడమే ఆలస్యం మ్యాచ్‌ల నిర్వహణకు నెలకొన్న అడ్డంకులపై దృష్టి సారించిన వెంకటేశ్ ప్రసాద్ అనుకున్నది సాధించాడు. ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవడం, ఏకసభ్య కమిషన్ సూచన మేరకు స్టేడియంలో అవసరమైన నిర్మాణాత్మక మార్పులు చేయడం ద్వారా ఐపీఎల్ సందడికి చిన్నస్వామి సిద్ధమైంది. ఆరంభ మ్యాచ్‌లోనే డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీని రికార్డ్ బ్రేకర్ సన్‌రైజర్స్ హైదరాబాద్ ఢీకొడుతోంది. శనివారం రాత్రి 7:30 గంటలకు మ్యాచ్ జరుగనుంది. అందుకని మ్యాచ్ సన్నద్ధతలో భాగంగా శుక్రవారం ఆర్సీబీ, ఆరెంజ్ ఆర్మీ ఆటగాళ్లు నెట్స్‌లో తీవ్రంగా శ్రమించారు. బ్యాటర్లు భారీ షాట్లు ప్రాక్టీస్‌తో చెమటోడ్చగా.. బౌలర్లు వికెట్టే లక్ష్యంగా బంతులు సంధించారు. అనంతరం ఫీల్డింగ్ చేస్తూ తొక్కిసలాటతో మసకబారిన చిన్నస్వామికి మునపటి కళను తీసుకొచ్చారు. విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్, జాకబ్ బెథెల్‌లు బ్యాటింగ్ సాధనతో బిజీగా గడపగా.. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ హెన్రిచ్ క్లాసెన్, అనికేత్ వర్మ పెద్ద షాట్లతో మేము సిద్ధమని చాటారు. విజయంతో టోర్నీని ఆరంభించాలనే కసితో ఉన్న రెండు జట్లలో బోణీ కొట్టేది ఎవరనేది ఉత్కంఠ రేపుతోంది.

ప్రజాప్రతినిధులకు ఉచితంగా ఐపీఎల్ టికెట్లుచిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌తో మెగా టోర్నీ మొదలవ్వనుంది. ఈ మ్యాచ్ టికెట్లు ఇప్పటికే అమ్ముడవ్వగా.. ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేల కోసం కర్నాటక క్రికెట్ సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. మేము వీఐపీలం, ఐపీఎల్ టికెట్లు మాకు ఇవ్వరా? అని బెదిరించినందున సమస్యను పెద్దది చేయడం ఇష్టంలేక ఉచితంగా టికెట్లు ఇవ్వాలని తీర్మానించింది. శుక్రవారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిసిన కేఎస్‌సీఏ అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్ వివాదానికి తెరదించాడు. 'మేము వీఐపీలం. ఐపీఎల్ టికెట్ల కోసం క్యూలో నిల్చోవాలా?' అని ప్రశ్నించిన కర్నాటక ఎమ్మెల్యేలు తమ పంతం నెగ్గించుకున్నారు. తమకు ఉచితంగా ఐపీఎల్ టికెట్లు ఇవ్వాలని, మైదానంలో ప్రత్యేక సీట్లు కేటాయించాలని వీరు చేసిన డిమాండ్లకు కర్నాటక రాష్ట్ర క్రికెట్ సంఘం అంగీకరించింది. ఎమ్మెల్యేల బెదిరింపుల నేపథ్యంలో శుక్రవారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిశాడు కేఎస్‌సీఏ అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్. ఐపీఎల్ ఆరంభ వేడుకకు రావాల్సిందిగా సీఎంకు ఆహ్వాన పత్రిక అందించారు. అంతేకాదు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఉచితంగా ఐపీఎల్ టికెట్లు ఇస్తామని ముఖ్యమంత్రికి వెంకటేశ్ ప్రసాద్ తెలిపారు.





## వైభవ్‌కి 15 ఏళ్లు

### తొలగిన ఐసీసీ అడ్డంకి

యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి ఐసీసీ నిబంధన అడ్డంకి తొలగిపోయింది. ఇక జాతీయ జట్టులోకి వచ్చేందుకు వీలు కలగనుంది. జాతీయ జట్టులోకి రావాలంటే ఎవరికైనా సరే 15



ఏళ్ల వయో పరిమితి ఉంది. వైభవ్ ఇవాళ 15వ ఏడాదిలోకి అడుగు పెట్టాడు. ఐపీఎల్ 2026 సీజన్ శనివారం నుంచి ప్రారంభం కానుండగా.. ఇందులో అదరగొడితే టీమ్‌ఇండియా తరఫున జాతీయ జట్టులోకి రావడం పెద్ద కష్టమేం కాదు. వైభవ్ 13 ఏళ్లకే ఐపీఎల్ వేలంలోకి అడుగు పెట్టాడు. సంచలన ఆటతీరుతో క్రికెట్ ప్రపంచాన్ని విస్మయానికి గురి చేశాడు. ఇటీవల 14 ఏళ్ల వయసులో అండర్ -19 జట్టుతో ఆడాడు. ఎమర్జింగ్ ఆసియా కప్‌లోనూ బరిలోకి దిగాడు. పరుగుల వర్షం కురిపించడంతో అతడిని జాతీయ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లూ వచ్చాయి. వయసు నిబంధన కారణంగా వీలు కాలేదు. ఇక ఆ అడ్డంకి కూడా తొలగడంతో అతడి అభిమానులు ఖుషీ అయ్యారు. మరో రెండు నెలల వరకూ టీమ్‌ఇండియా అంతర్జాతీయ క్రికెట్ ఆడేది లేదు. అఫ్గానిస్థాన్‌తో వన్డే సిరీస్‌కు అతడిని తీసుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు.

## సలీల్ అరోరాకు చోటు!

బ్యాటింగ్‌లో ఆరెంజ్ ఆర్మీకి తిరుగు లేకున్నా.. బౌలింగ్ బలహీనంగా కనిపిస్తోంది. ప్యాట్ కమిన్స్, ఇషాన్ మలింగా గాయాలతో ఇబ్బంది పడుతుండటం సన్‌రైజర్స్ సమస్యలను రెట్టింపు చేసింది. కమిన్స్ గైర్హాజరీలో ఇషాన్ కిషన్ జట్టును నడిపించనున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ విజయంతో పాటు టీ20 ప్రపంచకప్ గెలుపుతో రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఇషాన్ బరిలోకి దిగుతున్నాడు. అభిషేక్, ట్రావిస్ హెడ్, క్లాసెన్ బ్యాట్ ఝులిపించడంతో పాటు బౌలింగ్ బలహీనతలను అధిగమిస్తే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు తిరుగుండదు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటింగ్ లైనప్‌కు పరుగుల వరద పారే చిన్నస్వామి స్టేడియం సరిగ్గా సరిపోతుంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే ఫ్లాట్ వికెట్‌పై సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు చెలరేగి 250 ప్లస్ స్కోర్ నమోదు చేస్తే ఈజీగా విజయం నమోదు చేయవచ్చు. అయితే కమిన్స్ గైర్హాజరీలో సన్‌రైజర్స్ కాంబినేషన్ ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది. బ్యాటింగ్ లైనప్‌లో పెద్దగా మార్పులు లేకున్నా.. బౌలింగ్ సమస్యలను ఎలా అధిగమిస్తారు? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఓపెనర్లుగా ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ బరిలోకి దిగనుండగా.. ఫస్ట్ డౌన్‌లో ఇషాన్ కిషన్ ఆడనున్నాడు. నాలుగో స్థానంలో డేంజరస్ హెన్రీచ్ క్లాసెన్ ఆడనుండగా.. ఐదో స్థానంలో సలీల్ అరోరా బ్యాటింగ్ చేసే అవకాశం ఉంది. అతనికి తుది జట్టులో చోటు దక్కితే.. అరంగేట్ర మ్యాచ్ అవుతుంది. అనికేత్ వర్మతో అతనికి పోటీ నెలకొన్నా.. దేశవాళీ క్రికెట్‌తో పాటు ఇంట్రా స్క్వాడ్ ప్రాక్టీస్ మ్యాచ్‌లో సలీల్ అరోరా అదరగొట్టాడు. రింకూ సింగ్ తరహాలో సిక్సర్లు బాదుతూ ఫినిషర్ పాత్ర పోషించేందుకు రెడీగా ఉన్నాడు. దాంతో అతనికే అవకాశం దక్కనుంది. స్పిన్ బౌలింగ్ చేయడంతో పాటు విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగే లియామ్ లివింగ్ స్టోన్ ఆరో స్థానంలో ఆడుతాడు. నితీష్ కుమార్ రెడ్డి ఏడో స్థానంలో బరిలోకి దిగనుండగా.. హర్షల్ పటేల్ 8వ స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు. మ్యాచ్ పరిస్థితులకు తగ్గట్లు బ్యాటింగ్ ఆర్డర్‌లో స్వల్ప మార్పులు జరగవచ్చు.



## ఆడకపోతే ధోనీ రిటైర్ అవ్వాలి

ఐపీఎల్ ప్రారంభానికి ముందు ఎంఎస్ ధోనిపై రవిచంద్రన్ అశ్విన్ కీలకమైన వ్యాఖ్యలు చేశాడు. అతడిని చెన్నై సూపర్‌కింగ్స్ ఇంపాక్ట్‌ప్లేయర్‌గా ఆడించొద్దని సూచించాడు. అతడు జట్టులో ప్లేయింగ్ ఎలెవన్‌లో కచ్చితంగా ఉండాలన్నాడు. 'ధోని ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగడాన్ని నేను ఒప్పుకోను. అతడు ఒకవేళ చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులో ఉంటే... కచ్చితంగా ఆడాల్సిందే. ఆడొద్దు అనుకుంటే సీజన్ మొత్తం ఆడొద్దు. అంతేకానీ అతడు ఇంపాక్ట్ ప్లేయర్‌గా మాత్రం బరిలోకి దిగొద్దు' అని అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో విశ్లేషించాడు. 'మీరు చెన్నై సూపర్‌కింగ్స్



ప్లేయింగ్ ఎలెవన్‌ను తయారుచేస్తుంటే.. అందులో ఎంఎస్ ధోనికి కచ్చితంగా స్థానం కల్పించాలి. ఒకవేళ అతడు ఆడొద్దు అనుకుంటే.. రిటైర్ అవ్వాలి. అయితే.. తాను ఆడగలననే నమ్మకం అతడిలో 100 శాతం ఉంది. ధోని మూడు నెలలుగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. దీనిద్వారా అతడు తాను ఆడగలననే సందేశాన్ని ఇస్తున్నాడు. ఒకవేళ అతడు ఆడాలనుకుంటే.. నువ్వు ఆడటం కుదరదు.. అని అతడితో చెప్పడం మీకు సాధ్యం కాదు' అని అశ్విన్ పేర్కొన్నాడు. 'అతడు మీ ఆరో నంబర్ బ్యాటర్ కాదనే విషయాన్ని నేను అంగీకరిస్తున్నా. అతడు రెండు పాత్రలు పోషించగలడు. మైదానంలో ధోని.. రుతురాజ్ గైక్వాడ్‌కు దిక్సూచిలా పనిచేస్తాడు. కొత్త బౌలింగ్ లైనప్‌నకు సహాయ సహకారాలు అందిస్తాడు. గత సంవత్సరం అతడు చివరి మూడు ఓవర్లు ఆడాలని చూశాడు. కానీ ప్రతిసారీ టాప్ ఆర్డర్ పరుగులు రాబట్టలేదు. అతడు కాస్త ముందే బ్యాటింగ్‌కు వచ్చి ఉండాల్సింది. అయితే ఈసారి మాత్రం ఆ పరిస్థితి లేదు. వారు టాప్ ఆర్డర్‌ను పటిష్టం చేసుకున్నారు' అని అశ్విన్ అన్నాడు.



## రోహిత్ కుర్రాడిలా ఉన్నావ్

ఐపీఎల్ 2026 సీజన్ కోసం ముంబయి ఇండియన్స్ ముమ్మరంగా సాధన చేస్తోంది. ఈ క్రమంలో జట్టు సభ్యులను కలిసేందుకు ముంబయి ఇండియన్స్ సహ యజమాని నీతా అంబానీ వచ్చారు. ఈ సందర్భంగా రోహిత్‌ను చూసి నీతా అంబానీ.. 'ఓ మై గాడ్.. రోహిత్ నిన్ను నేను గుర్తుపట్టలేకపోయా. నువ్వు చాలా కుర్రాడిగా కనిపిస్తున్నావు' అని నవ్వుతూ మాట్లాడిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇటీవల కాలంలో రోహిత్ శర్మ సన్నబడి ఫిట్‌గా ఉన్న సంగతి తెలిసిందే. టీమ్‌ఇండియా తరఫున కేవలం వన్డేలను మాత్రమే ఆడుతోన్న రోహిత్.. వచ్చే ఏడాది వరల్డ్ కప్ లక్ష్యంగా ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టాడు.

## సీఎస్‌కేలోకి వస్తానని సంజు ఎప్పుడో అన్నాడు: రుతురాజ్

తన అభిమాన జట్టులో చేరినందుకు సంజు శాంసన్ ఖుషీగా ఉన్నాడు. అయితే, మూడేళ్ల కిందటే రుతురాజ్ గైక్వాడ్‌తో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు గురించి సంజు శాంసన్ చర్చించాడట. ఇదే విషయాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో సీఎస్‌కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ వెల్లడించాడు. అప్పుడు కూడా కెప్టెన్సీ గురించి ఆలోచించలేదని.. సీఎస్‌కేకు ఆడేందుకే ఆసక్తి చూపించినట్లు రుతురాజ్ తెలిపాడు.



'మేమిద్దరం మూడేళ్ల కిందట అనుకుంటా.. అప్పుడు ఇంగ్లాండ్‌లో ఉన్నాం. సీఎస్‌కే డ్రెస్సింగ్ రూమ్, జట్టు గురించి అడిగాడు. వాతావరణం ఎలా ఉంటుందో వాకబు చేశాడు. 'ఎప్పుడు అవకాశం వచ్చినా.. ఒక దక్షిణాది వ్యక్తిగా మీరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావిస్తున్నాను. కెప్టెన్సీ గురించి పెద్దగా పట్టింపు లేదు. ఇక్కడ ఆడటమంటే నాకు చాలా ఇష్టం. ఇక్కడి వాతావరణం, సంస్కృతి నచ్చాయి. ప్లేయర్‌గా ఎంతో సంతోషంగా ఉన్నా' అని చెప్పా. అప్పుడు సంజు స్పందిస్తూ.. 'నేను కూడా కేవలం కెప్టెన్ అయితేనే వస్తాననే పరిస్థితి నాకు వద్దు. నేను మీ నాయకత్వంలో ఆడాలని అనుకుంటున్నా. అది మీ జట్టు. మీ ఫ్రాంచైజీ. కేవలం ఒక్క ఆటగాడిగానే వస్తా. ఎప్పుడు అవకాశం వచ్చినా.. దానిని వదులుకోను' అని నాతో అన్నాడు. ఇప్పుడు ఆ రోజు వచ్చిందని రుతురాజ్ గుర్తు చేసుకున్నాడు.



## తిలక్ వర్మకు గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వాలి: పాడి కౌశిక్ రెడ్డి

టీమిండియా స్టార్ బ్యాటర్, తెలుగు తేజం తిలక్ వర్మకు గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వాలని బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే, మాజీ హైదరాబాద్ రంజీ క్రికెటర్ పాడి కౌశిక్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చినట్లే తిలక్ వర్మకు ఉద్యోగం ఇవ్వాలని అసెంబ్లీలో కోరారు. తిలక్ వర్మతో పాటు మాజీ బ్యాడ్మింటన్ ప్లేయర్ గుత్తా జ్వాల, మాజీ క్రికెటర్ ప్రజ్ఞాన్ ఓజా, అండర్ 19 వరల్డ్ కప్ టీమ్ మెంబర్ త్రితికి కూడా నగదుసాయం, స్థలం, ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈవార్తలు
# ప్రజావాణి
శనివారం 28-3-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# శాంతికి సవాలుగా అమెరికా విధానాలు

నేటి అంతర్జాతీయ రాజకీయాల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచాన్ని అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. ఆయన అనుసరిస్తున్న 'అమెరికా ఫస్ట్' విధానం, పాత మిత్రదేశాలతో విభేదాలు, అంతర్జాతీయ ఒప్పందాల నుంచి ఏకపక్షంగా వైదొలగడం వంటి చర్యలు నేడు అనేక యుద్ధాలకు, ఘర్షణలకు పునాది వేస్తున్నాయి. 2026 ప్రారంభం నుండి అమెరికా విదేశీ విధానంలో కీలక మార్పులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్‌పై ఇజ్రాయెల్‌తో కలిసి జరిపిన దాడులు మధ్యప్రాచ్యాన్ని అగ్నిగుండంగా మార్చాయి. ఒకవైపు శాంతి చర్చలు జరుపుతున్నామని చెబుతూనే, మరోవైపు వ్యూహాత్మక దాడులు చేయడం ట్రంప్ మార్కు 'తుంటరితనానికి' నిదర్శనం. ఫిబ్రవరి 2026లో ప్రారంభమైన ఈ ఉద్రిక్తతలు ప్రస్తుతం తాత్కాలిక విరామ స్థితిలో ఉన్నప్పటికీ, శాశ్వత పరిష్కారం ఇంకా అందని ద్రాక్షగానే ఉంది. ఇరాన్ అణు ఒప్పందం వంటి చారిత్రాత్మక ఒప్పందాల నుంచి తప్పుకోవడం వల్ల అంతర్జాతీయంగా నమ్మకం సడలింది. వెనెజువెలాలో ప్రభుత్వం మార్పు కోసం జరిపిన సైనిక జోక్యం, నైజీరియా, సోమాలియాలో పెరిగిన వైమానిక దాడులు అమెరికా తన ఆధిపత్యాన్ని ప్రదర్శించడానికి దౌత్యాన్ని కాకుండా ఆయుధాలను నమ్ముకుంటోందని స్పష్టం చేస్తున్నాయి. నాటో వంటి పాత మిత్ర కూటములను విస్మరించడం వల్ల యూరప్ దేశాల్లో ఆందోళన పెరుగుతోంది. అమెరికాను నమ్ముకోలేమనే భావన ప్రపంచవ్యాప్తంగా బలపడుతోంది. యుద్ధాలే కాకుండా, చైనా వంటి దేశాలపై విధిస్తున్న భారీ టారిఫ్‌లు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి. దీనివల్ల ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుడిపై భారం పడుతోంది. ట్రంప్ తన వ్యక్తిగత ఇమేజ్ కోసం తీసుకుంటున్న నిర్ణయాలు అంతర్జాతీయ నియమాలను కాలరాస్తున్నాయి. ఒక అగ్రరాజ్య అధినేతగా ప్రపంచ శాంతిని కాపాడాల్సిన బాధ్యత ట్రంప్‌పై ఉంది. కానీ, "యుద్ధాలను ఆపుతాను" అని చెబుతూనే మరిన్ని యుద్ధాలకు కారణమవ్వడం విచారకరం. ఇప్పటికైనా అమెరికా తన మొండివైఖరిని వీడి, అంతర్జాతీయ చట్టాలకు గౌరవం ఇస్తూ, సామరస్యపూర్వక దౌత్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. లేనిపక్షంలో, ఈ 'తుంటరితనం' ప్రపంచాన్ని మూడో ప్రపంచ యుద్ధం వైపు నడిపించే ప్రమాదం ఉంది.

## సర్వోదయ తెలంగాణకు
# అవకాశం!

తెలంగాణ గడ్డ ఎప్పుడూ రాజకీయ చైతన్యానికి మారుపేరు. ఉద్యమ కాలం నుంచి మొన్నటి మున్సిపల్ ఎన్నికల (2026) వరకు ఇక్కడి ప్రజలు తమ తీర్పును స్పష్టంగా ఇస్తూనే ఉన్నారు. అయితే, ప్రస్తుతం ఉన్న ప్రధాన పార్టీల మధ్య ఏర్పడిన శూన్యతను భర్తీ చేసేందుకు కొత్త శక్తులు రంగ ప్రవేశం చేస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది, బీజేపీ తన ఉనికిని చాటుకుంటోంది, బీఆర్ఎస్



తన పట్టును నిలుపుకునే ప్రయత్నంలో ఉంది. అయినప్పటికీ, ఒక 'ప్రత్యామ్నాయ గొంతుక' కోసం వెతుకులాట కనిపిస్తోంది. జనాభాలో సగం ఉన్న మహిళల సమస్యలను, వారి రాజకీయ ఆకాంక్షలను ప్రతిబింబించే బలమైన శక్తి లేదనేది ఒక వాదన. కవిత "సర్వోదయ తెలంగాణ" నినాదంతో వస్తుండటం ఈ వర్గాన్ని ఆకర్షించే ప్రయత్నమే.'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే ప్రాథమిక సూత్రాలు ఇంకా పూర్తిస్థాయిలో నెరవేరలేదన్న అసంతృప్తి యువతలో ఉంది. ఈ అసంతృప్తినే పెట్టుబడిగా మార్చుకోవడానికి కొత్త పార్టీలకు అవకాశం ఉంది. కొత్త పార్టీ రాక కేవలం ఓట్లను చీల్చడానికే పరిమితం కాదు, అది రాజకీయ అజెండాను కూడా మారుస్తుంది. ఇప్పటివరకు ప్రధానంగా ద్విముఖ లేదా త్రిముఖ పోటీ ఉన్న చోట, నాలుగో శక్తి వస్తే ఓట్ల చీలిక అనివార్యం. ఇది అధికార పక్షానికి లాభం చేకూరుస్తుందా లేదా ప్రతిపక్ష ఓట్లను గండి కొడుతుందా అనేది ఆ పార్టీ ఎంచుకునే వైఖరిపై ఆధారపడి ఉంటుంది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల మధ్య ప్రాంతీయ సెంటిమెంట్‌ను బలంగా వినిపించే పార్టీలకు తెలంగాణలో ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. కొత్త పార్టీ పెట్టడం ఎంత ఉత్సాహంగా ఉంటుందో, దాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడం అంతకంటే పెద్ద సవాలు. కేవలం నాయకత్వం ఉంటే సరిపోదు, గ్రామీణ స్థాయి వరకు బలమైన కార్యకర్తల సైన్యం అవసరం."బీ-టీమ్" ముద్ర పడకుండా ఉండటం కొత్త పార్టీలకు అతిపెద్ద పరీక్ష. ఇతర పార్టీల నీడలో ఉన్నట్లు ప్రజలు భావిస్తే, వారి ఆదరణ పొందడం కష్టం. తెలంగాణ రాజకీయం ఇప్పుడు ఒక సంధి దశలో ఉంది. పాత వైభవానికి, కొత్త ఆశలకు మధ్య ఓటరు ఊగిసలాడుతున్నాడు. కొత్తగా వచ్చే పార్టీలు కేవలం పదవుల కోసం కాకుండా, ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా వస్తేనే ప్రజలు బ్రహ్మరథం పడతారు. 2026 ఏప్రిల్‌లో జరగబోయే ఈ పరిణామాలు రాబోయే సాధారణ ఎన్నికలకు దిక్సూచిగా మారే అవకాశం ఉంది.



- గంగాధర్



# యుద్ధాల జమానా!



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు వివిధ రకాల సాయుధ పోరాటాలు, సంఘర్షణల్లో చిక్కుకున్నాయి. ప్రధాన అంతర్జాతీయ నివేదికల ప్రకారం, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అత్యధిక సంఖ్యలో యుద్ధాలు, ఘర్షణలు జరుగుతున్న సమయం ఇదే. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 56 నుండి 59 ప్రధాన సాయుధ సంఘర్షణలు జరుగుతున్నాయి.

**ఇందులో 92 దేశాలు ఏదో ఒక రకమైన యుద్ధ కార్యకలాపాల్లో (నేరుగా లేదా మద్దతుగా) పాల్గొంటున్నాయి. అతి ముఖ్యంగా పశ్చిమాసియా ప్రాంతం మరోసారి యుద్ధ జ్వాలల్లో చిక్కుకుంది. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం ఇప్పుడు బహిరంగ పోరాటంగా మారింది. ముఖ్యంగా అమెరికా ప్రత్యక్షంగా రంగంలోకి దిగడంతో ఈ వివాదం ప్రపంచ శాంతికి పెను సవాలుగా పరిణమించింది.**

ఫిబ్రవరి 2026 చివరలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ, ఇతర కీలక నేతల హత్యతో ఈ ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరుకున్నాయి. డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం ఇరాన్‌పై కఠిన వైఖరిని అవలంబిస్తోంది. ఇరాన్‌ను పూర్తిగా అణచివేస్తామని హెచ్చరిస్తూనే, మరోవైపు చర్చల కోసం ఐదు రోజుల పాటు దాడులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. అమెరికాతో యుద్ధానికి తాము సిద్ధమని, ఇందుకోసం 10 లక్షల మంది సైనికులను సమీకరిస్తున్నామని ఇరాన్ ప్రకటించింది. ఈ యుద్ధం కేవలం మూడు దేశాలకే పరిమితం కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది.పశ్చిమాసియాలో అస్థిరత వల్ల ముడి చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇది భారత్ వంటి దేశాలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతోంది. హోర్ముజ్ జలసంధి వంటి కీలక మార్గాలను ఇరాన్ నియంత్రించాలని చూడటం ప్రపంచ వాణిజ్యానికి విఘాతం కలిగిస్తోంది.



- రామస్వామి చింత

**రష్యా - ఉక్రెయిన్ యుద్ధం:**
ఇది 21వ శతాబ్దపు అతిపెద్ద భూభాగ యుద్ధం. ఉక్రెయిన్ నాటో కూటమిలో చేరాలనే ప్రయత్నం, ఉక్రెయిన్ పై రష్యా తన పట్టును నిరూపించుకోవాలనుకోవడం వల్ల ఈ యుద్ధం వల్ల ప్రపంచ ఇంధన ధరలు, ఆహార సరఫరా (గోధుమలు) దెబ్బతిన్నాయి. రష్యాపై పాశ్చాత్య దేశాలు కఠినమైన ఆంక్షలు విధించాయి. యుద్ధం డ్రోన్ దాడులు, క్షిపణి దాడులతో సుదీర్ఘంగా సాగుతోంది.

**ఇజ్రాయెల్ - హమాస్ / గాజా సంక్షోభం:**
2023 అక్టోబర్ 7న హమాస్ చేసిన దాడికి ప్రతిస్పందనగా ఇజ్రాయెల్ గాజాపై పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రకటించింది. ఇది ఇప్పుడు కేవలం గాజాకే పరిమితం కాకుండా, లెబనాన్‌లోని హెజ్బొల్లా, యెమెన్‌లోని హౌతీ రెబల్స్, నేరుగా ఇరాన్‌తో కూడా ఘర్షణలకు దారితీసింది. గాజాలో వేలాది మంది ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**సూడాన్ అంతర్యుద్ధం:**
ప్రపంచం దృష్టికి రాని అతిపెద్ద మానవతా సంక్షోభం ఇది. సూడాన్ సాయుధ దళాలు, రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ అనే పారామిలిటరీ బృందం మధ్య అధికారం కోసం జరుగుతున్న పోరు. కోటి మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. దేశంలో తీవ్రమైన కరువు ఏర్పడింది.

**మయన్మార్ అంతర్యుద్ధం:**
2021లో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూలదోసి సైన్యం అధికారాన్ని చేజిక్కించుకుంది. దేశంలోని వివిధ ప్రాంతీయ సాయుధ గ్రూపులు, పౌర ప్రతిఘటన దళాలు కలిసి సైనిక పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. ప్రస్తుతం సైన్యం దేశంలోని చాలా భాగంపై నియంత్రణ కోల్పోయింది.

**ఆఫ్రికాలోని ఇతర సంఘర్షణలు:**
డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో: ఇక్కడ దశాబ్దాలుగా వందలాది సాయుధ గ్రూపుల మధ్య ఖనిజ వనరుల కోసం పోరు జరుగుతోంది.

**ఇథియోపియా:**
టిగ్రే ప్రాంతంలో యుద్ధం ముగిసినా, అమారా, ఒరోమియా ప్రాంతాల్లో ఇంకా ఘర్షణలు కొనసాగుతున్నాయి.

**సహెల్ ప్రాంతం (మాలి, బుర్కినా ఫాసో, నైజర్):**
ఇక్కడ ఇస్లామిక్ స్టేట్, అల్-ఖైదా వంటి ఉగ్రవాద సంస్థల ప్రభావం పెరిగింది.

**యుద్ధాల వల్ల కలుగుతున్న నష్టాలు:**
ఆర్థిక మాంద్యం: ప్రపంచ సరఫరా గొలుసు దెబ్బతిని వస్తువుల ధరలు పెరుగుతున్నాయి.

**శరణార్థుల సమస్య:**
చరిత్రలో ఎన్నడూ లేనంతగా సుమారు 12 కోట్ల మంది యుద్ధాల వల్ల సొంత ఇళ్లను వదిలి వెళ్ళాల్సి వచ్చింది.

**ఆయుధ పోటీ:**
దేశాలు తమ రక్షణ బడ్జెట్‌ను భారీగా పెంచుకుంటున్నాయి, దీనివల్ల విద్య, ఆరోగ్యంపై ఖర్చు తగ్గుతోంది.
యుద్ధాలు మానవాళికి ఎప్పుడూ విషాదాన్ని, విధ్వంసాన్ని మిగిల్చాయి. యుద్ధం వల్ల కలిగే ఆర్థిక నష్టం, ప్రాణనష్టం పూడ్చలేనివి. అభివృద్ధి చెందిన దేశాలైనా, చెందుతున్న దేశాలైనా యుద్ధాల వల్ల దశాబ్దాల పాటు వెనకబడిపోతాయి. ఏ సమస్యకైనా చర్చల ద్వారా పరిష్కారం వెతకడం ఉత్తమం. యుద్ధ సమయంలో అత్యధికంగా నష్టపోయేది సామాన్య ప్రజలే. దేశాల మధ్య సరిహద్దు గొడవలు ఉన్నప్పటికీ, సామాన్యుల ప్రాణాలకు, ప్రాథమిక అవసరాలకు భంగం కలగకుండా చూడటం అంతర్జాతీయ బాధ్యత. నేటి ప్రపంచంలో దేశాలన్నీ ఒకదానిపై ఒకటి ఆర్థికంగా ఆధారపడి ఉన్నాయి. ఒక చోట జరిగే యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ఆహార కొరత, ఇంధన ధరల పెరుగుదల, ఆర్థిక మాంద్యానికి దారితీస్తుంది. ఆయుధాల కోసం చేసే ఖర్చును విద్యా, ఆరోగ్య రంగాలపై పెడితే పేదరికం, ఆకలి వంటి సమస్యలను నిర్మూలించవచ్చు. యుద్ధం కేవలం వినాశనాన్ని మాత్రమే ఇస్తుంది, కానీ శాంతి అభివృద్ధికి పునాది వేస్తుంది. యుద్ధాల వల్ల పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుంది. విషపూరిత వాయువులు, బాంబు దాడులు భూమిని, నీటిని కలుషితం చేస్తాయి, ఇది రాబోయే తరాల మనుగడపై ప్రభావం చూపుతుంది. ఇది గ్రహించకపోతే మానవ వినాశనం తప్ప ఇంకేం ఉండదు.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.